RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 361 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 21 జనవరి 2025 | మంగళవారం | పేజీలు : 4

## భిన్నత్వంలో ఏకత్వానికి కుంభమేళా ప్రతీక

న్యూఢిల్లీ : ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా భిన్న త్వంలో ఏకత్వానికి ప్రతీకని ప్రధాని మోదీ అన్నారు. సమానత్వం, సామరస్యాల అసాధారణ సంగమమైన ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రపంచ దేశాల ప్రజలు ఇక్కడకు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రసంగించా రు. వేల ఏళ్లుగా కొనసాగుతున్న కుంభమేళాలో ఎక్కడా ధనిక, పేద తారతమ్యం, కులాల పేరుతో వివక్షకు తావులేదని చెప్పారు. ఇటువంటి కుంభమేళాలు ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు ఒకేలా ఉన్నాయన్నారు. ప్రయాగ్‌రాజ్, ఉజ్జయిని, నాసిక్. హరిద్వార్‌లో కుంభమేళాలు నిర్వహిస్తుంటే, మరోవైపు దక్షిణాదిలో గోదావరి, కృష్ణా, నర్మద, కావేరి నదులకు పుష్కరాలు నిర్వహిస్తారని గుర్తుచేశారు.

# రేవంత్‌రెడ్డిపై అధిష్టానం 'గురి'

## ఢిల్లీ బాధ్యతలు అప్పగించిన రాహుల్ గాంధీ..!




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ కు కాంగ్రెస్ హైకమాండ్ బిగ్ టాస్క్ అప్పగించింది. దావోస్ టూర్ నుంచి వస్తూనే రేవంత్ ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలోకి దిగనున్నారు. ఢిల్లీలో ప్రచారం కోసం రేవంత్ ను కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ గా ఎంపిక చేసింది. మొత్తం 40 మందితో జాబితా విడుదల చేసింది. తాజాగా ఢిల్లీ ఎన్నికలకు సంబంధించిన రెండు కీలక హామీలను రేవంత్ పీసీసీ చీఫ్ తో కలిసి ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో, గ్యారంటీల ప్రచార బాధ్యతలను రేవంత్ కు అప్పగించారు. ఢిల్లీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఆప్ తో పొత్తు లేకపోయినా అక్కడ గెలుపు పైన నమ్మకం పెట్టుకుంది. ఆప్ పైన ప్రజా వ్యతిరేకత ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక, బీజేపీ సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలు ఓటర్లకు తమ హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలు ప్రకటించాయి. కాగా, కాంగ్రెస్ అయిదు ప్రధాన గ్యారంటీలనే ఎన్నికల ప్రచార అస్త్రాలుగా మార్చుకుంది. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ ఢిల్లీ పీసీసీ చీఫ్ తో కలిసి తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ 500 కే గ్యాస్ సిలిండ ర్ ఇస్తామని.. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే బాధ్యత తదనేనని హామీ ఇచ్చారు. తెలంగాణలో ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తున్నామని రేవంత్ చెప్పుకొచ్చారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిని ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఏపీ- తెలంగాణకు చెందిన పార్టీ నేతలను కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి నియమిస్తోంది. తాజాగా పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంకతో సహా మొత్తం 40 మంది వరకు ఉన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోనూ రేవంత్ ను స్టార్ క్యాంపెయినర్ గా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించింది. ఇక, ఇప్పుడు ఢిల్లీలో గ్యారంటీల గురించి ప్రచారం చేయటంతో పాటుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని రాహుల్ నిర్దేశించారు. దీంతో, ఇప్పుడు ఢిల్లీ వేదికగా రేవంత్ పార్టీ కోసం ప్రచారం చేయనున్నారు.

అయితే రేవంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం అమితంగా నమ్మడానికి ఆయన కష్టపడే శైలేనని, రేవంత్‌రెడ్డికి ఒక బాధ్యతను అప్పగిస్తే ఆయన చేసే కృషి అంతా ఇంతా కాదని కాంగ్రెస్ పెద్దలు అమతంగా విశ్వస్తున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.




హైదరాబాద్ : తెలంగాణ చేపట్టిన, చేపట్టనున్న కీలక ప్రాజెక్టు లకు సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్కార్ కోరింది. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తగినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రం చేపట్టిన మూసీ, మెట్రో, ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్‌ఆర్, రేడియల్ రోడ్ల ప్రాజెక్టులు, స్పోర్ట్స్, స్కిల్ యూనివర్సిటీలకు కనీసం రూ.40 వేల కోట్లు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని ప్రతిపాదనలు పంపించింది. రానున్న నాలుగేండ్ల పాటు ప్రతి బడ్జెట్‌లోనూ ఇదే విధంగా కేటాయింపులు చేయాలని, అలా చేస్తే రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొంది. ఫలితంగా కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న 5 ట్రిలియన్ డాలర్ల ఎకనామీలో తెలంగాణ వన్‌ట్రిలియన్ డాలర్లు కంట్రిబ్యూట్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. తెలంగాణకు కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు మంజూరు చేయాలి. విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను రిలీజ్ చేయాలి. కేంద్ర ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గత ప్రభుత్వం కొన్ని పథకాలకు సంబంధించిన నిధులను మళ్లించడంతో ఇప్పుడు కేంద్రం నుంచి నిధులు ఇవ్వడం లేదు. కేంద్రం ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాల్లో భాగంగా నిధులు ఇస్తే, రాష్ట్ర వాటాను కూడా రిలీజ్ చేసి అమలు చేస్తాం' అని చెప్పింది. ఏపీతో సమానంగా తెలంగాణను చూడాలని.. ఏపీకి ఇస్తున్నట్టే, తెలంగాణకు నిధులు ఇవ్వాలని కోరింది.

**రాష్ట్రం పంపిన ప్రతిపాదనలివీ..** మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు, గోదావరి నుంచి 20 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లు అవుతుంది. ఈ మొత్తం కేంద్రం ఇవ్వాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు అవుతుంది. వీటికి కేంద్రం సహకారం అందించాలి. ట్రిపుల్ ఆర్ నార్త్, సౌత్ కు అన్ని రకాల అనుమతులు ఇవ్వడంతో పాటు నిర్మాణం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలి. ట్రిపుల్ ఆర్ తో పాటు రేడియల్ రోడ్లు వేస్తున్నాం. ఇవి పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్ లు, లాజిస్టిక్ పార్క్లు, రీక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయి. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ అనుసంధానానికి రేడియల్ రోడ్లు,10 గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఓఆర్ఆర్ ను అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు అవసరం. బడ్జెట్?లో ఆ మేరకు కేటాయింపులు చేయాలి. మెట్రో విస్తరణకు కేంద్రం సాయం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50:50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేపట్టేందుకు నిధులు కేటాయించాలి. మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలీస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్-నుంచి పటాన్ చెరు, ఎల్‌బీ నగర్ నుంచి -హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కిలోమీటర్లు నిర్మించేలా డీపీఆర్ కేంద్రానికి పంపినం. మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్?సిటీలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర బడ్జెట్?లో నిధులు కేటాయించాలి. హైదరాబాద్ నగరంతో పాటు సమీప 27 మున్సిపాలిటీల్లో 7,444 కిలోమీటర్ల మేర సీవరేజీ నెట్‌వర్క్ పనులకు రూ.17,212.69 కోట్లతో సమగ్ర సీవరేజీ కోసం అమృత్ 2 లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద నిధులు ఇవ్వాలి. దాన్ని కేంద్రమే చేపట్టాలి. వరంగల్ లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.4,170 కోట్లతో ప్లాన్ రూపొందించాం. దీన్ని అమృత్ 2 లేదా ప్రత్యేక పథకం కింద చేపట్టాలి. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలి. ఈ ప్రాజెక్టుతో కరువు, ఫ్లోరైడ్ పీడిత నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి(బీఆర్‌జీఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులు రూ.2 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని రిలీజ్? చేయాలి. కొత్తగా బడ్జెట్‌లో మళ్లీ కేటాయింపులు చేయాలి. రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక కారిడార్లకు నిధులు ఇవ్వాలి. కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్కుల ఏర్పాటుకు నిధులు కేటాయించాలి.

## కాకుల్లా ఏకం కావాలి..

### రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించాలి.. : కేటీఆర్

హైదరాబాద్ : ఒక్క కాకికి కష్టం వస్తే పది కాకుల ఎలా గైతే వాలిపోతాయో.. అలాగే ఒక్క కార్మికుడికి కష్టం వస్తే అందరూ కలిసి ఉద్యమించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ.. రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించాలని కార్మికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. ఇవాళ ఆవిష్కరించుకున్న క్యాలెండర్ తేదీలు మారే క్యాలెండర్‌గా ఉండిపోకూడదు.. పోరాటాలు చేసే క్యాలెండర్ కావాలి ఇది. ఆటో డ్రైవర్లకు హామీలు ఇచ్చిండు.. కానీ అమలు చేయడం లేదు. ఇవాళ ఆటో డ్రైవర్లు ఓఆర్ఆర్ బయట ఉండాలని అంటుండు. ఆటో వాళ్లకు బతుకుదెవురు లేకుండా చేస్తుండు. మే 1వ తేదీ లోపు 15 రోజులకు ఒక ప్రోగ్రాం తీసుకోవాలి. గిగ్ వర్కర్స్‌తో మీటింగ్ పెట్టాలి. ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లకు బడ్జెట్ పెట్టే విధంగా పోరాటం చేయాలి. కార్మిక దినోత్సవం రోజు వరకు అమలు కావాలి. కాకి కష్టం వస్తే.. అన్ని కాకులు గుమిగూడినట్లు మీరు ఏకం కావాలి. ఒక కార్మికుడికి కష్టం వస్తే అందరం కలిసి ఉద్యమించాలి. హైదరాబాద్ నగరంతో పాటు మిగతా జిల్లాల్లో కొత్త కమిటీలు వేసుకోవాలి. పోరాట పటిమ ఉన్నోళ్లు, రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించే వాళు రావాలి. ఎవరి మీద ఎక్కువ కేసులు అయితే వారు పెద్ద నాయకులు అవుతారు. పోయింది అధికారం మాత్రమే పోరాట పటిమ కాదు. 420 హామీలను అమలు చేసే దాకా వెంబడపడుదాం.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు.




# తెలంగాణాలోనూ 'కూటమి'

## 'స్థానిక' రంగంలోకి ఎన్డీఏ!

## ఏపీలో కూటమి సక్సెస్‌తో....

## అమిత్‌షా సరికొత్త వ్యూహాం?

హైదరాబాద్ / అమరావతి : ఏపీలో ఎన్డీయే కూటమి కట్టినప్పుడల్ల ఘన విజయమే దక్కుతూ వస్తోంది. అది 2014, 2024లో రుజువు అయింది. ఇక తెలంగాణాలో చూస్తే ఉమ్మడి ఏపీలో ఉన్నపుడు ఎన్డీయే కూటమి కట్టి మంచి ఫలితాలను టీడీపీ బీజేపీ అందుకున్నాయి. ఇక 2018 ఎన్నికల తరువాత టీడీపీ తెలంగాణా పట్ల రాజకీయ ఆసక్తిని తగ్గించేసింది. జనసేన విషయం తీసుకుంటే 2023 ఎన్నికల్లో బీజేపీతో కలసి అక్కడ పోటీ చేసింది. ఇక 2024లో ఏపీలో బంపర్ మెజారిటీతో అధికారం దక్కడంతో బాబు తెలంగాణాలో పార్టీ విస్తరణ గురించి ఆలోచన చేస్తున్నారు. సీరియస్ గానే దాని మీద ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏపీకి వచ్చిన కేంద్ర హోం మంత్రి బీజేపీ వ్యూహకర్త అయిన అమిత్ షా చంద్రబాబు నివాసంలో విందారగించారు. ఈ సందర్భంగా అనేక విషయాలు ఆయన చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో చర్చించారు అని భోగట్టా. ఈ క్రమంలోనే అమిత్ షా తెలంగాణాలో సైతం ఎన్డీయే కూటమిని విస్తరించాలని ప్రతిపాదించారని తెలుస్తోంది. దానికి చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఇద్దరూ అంగీకరించినట్లుగా చెబుతున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండవ ప్లేస్ లో బీఆర్ఎస్ ఉంది. మూడవ ప్లేస్ లో బీజేపీ ఉంది. బీజేపీకి 2028 అధికారం ముఖ్యంగా ఉంది. తెలంగాణాలో పీఠం అందుకోవాలని చూస్తోంది. దాంతో అనేక రకాలైన రాజకీయ ఎత్తుగడలను వేస్తోంది. ఈ నేపథ్యంలో నుంచే అమిత్ షా ఈ కీలక ప్రతిపాదన చేసి ఉంటారని అంటున్నారు. తెలంగాణాలో టీడీపీకి కొంత ఓటు బ్యాంక్ ఉంది. ఈ రోజుకీ ఎన్టీఆర్ పట్ల ఆదరణ ఉన్న వారు ఉన్నారు. అలాగే చంద్రబాబుకు హైటెక్ సిటీ నిర్మాతగా పేరు ఉంది. మరో వైపు పవన్ కళ్యాణ్ కి కూడా తెలంగాణాలో అపారమైన అభిమాన జనం ఉన్నారు. ఆయన సామాజిక వర్గం కూడా గట్టిగా ఉంది. దాంతో ఈ మూడు పార్టీలు జత కడితే తప్పకుండా కాంగ్రెస్ బీఆర్ ఎస్ లను ధీటుగా ఎదుర్కొని అధికారం అందుకోగలమన్న నమ్మకం అయితే బీజేపీ పెద్దలతో కనిపిస్తోంది అని అంటున్నారు. ఇక తెలంగాణాలో వెంటనే ఉన్నవి స్థానిక ఎన్నికలు అని అంటున్నారు. ఆ ఎన్నికలు ఈ ఏడాది మధ్యలో జరుగుతాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిగా ఈ మూడు పార్టీలు పోటీ చేయాలని ఆలోచిస్తున్నాయని అంటున్నారు. ఈ మూడు పార్టీల కలయికను ప్రజలు ఎలా స్వీకరిస్తారు, బీజేపీలోని తెలంగాణా నాయకులు ఏ విధంగా రియాక్ట్ అవుతారు, బీఆర్ఎస్ ఆంధ్రా వాదాన్ని ఏ విధంగా వినిపిస్తుంది అన్నవి కూడా ఈ మినీ అసెంబ్లీ ఎన్నికల్లో తేలుతుంది అని అంటున్నారు. అందుకే లిట్మస్ టెస్ట్ గా లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసి ఆ మీదట మంచి ఫలితాలు అందుకుంటే కనుక దానిని కంటిన్యూ చేస్తూ 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి కొనసాగిస్తారు అని అంటున్నారు. ఇక తెలంగాణాలో ఎన్డీయే కూటమి విస్తరణకు సంబంధించి ఉండవల్లిలోని బాబు ఇంట్లో అమిత్ షా ప్రస్తావించినా దాని వెనక భారీ వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. అందుకే ఢిల్లీలో మరోమారు భేటీ వేసి కీలక నిర్ణయం ఈ విషయంలో తీసుకోవాలని కూడా ఆయన కోరారని అంటున్నారు. నిజంగా కనుక ఎన్డీయే కూటమి తెలంగాణాలో పోటీ చేస్తే మంచి ఫలితాలే వస్తాయని అంటున్నారు. చంద్రబాబు పవన్ బలానికి తోడు బీజేపీ వ్యూహాలు అమిత్ షా మోడీ చరిష్మా తోడు అయితే కచ్చితంగా గెలుపు సాధిస్తారు అని అంటున్నారు. ఈ విషయాల మీద పూర్తి రాజకీయ అవగాహన ఉండబట్టే అమిత్ షా ఈ విధంగా ప్రతిపాదన చేశారు అని అంటున్నారు.

ఇక భౌగోళికంగా వేరుగా ఉన్నా రెండు చోట్లా తెలుగు వారే ఉన్నారు. ఇక ప్రజలు ఎక్కడ ఉన్నా ప్రజల సెంటిమెంట్ వారి అభిప్రాయాలు అన్నీ కూడా ఒకేలా ఉంటాయి కాబట్టి ఈ ప్రయోగం హిట్ అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. మొత్తానికి ఏపీకి అమిత్ షా రావడం ద్వారా ఎన్డీయే కొత్త బంధానికి బాటలు వేశారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# సంపాదకీయం

## లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు దేవుని ఆగ్రహ ఫలితమా?

సుమారు రెండు వారాలుగా అగ్రరాజ్యం అమెరికాలోనే అత్యంత ఖరీదైన భవనాలు, ధనవంతులు ఉండే ప్రాంతంగా చెప్పే లాస్ ఏంజెలెస్‌ను కార్చిచ్చు దహించివేస్తోంది. అగ్నిమాపక సిబ్బంది అలుపెరగకుండా అహర్నిశలూ విశ్వప్రయత్నాలు చేస్తూన్నా.. వేగంగా వీస్తున్న గాలుల నుంచి ప్రతికూలత ఏర్పడుతుందని అంటున్నారు. ఈ సమయంలో ప్రస్తుతం 'లాస్ ఏంజెలెస్ పరిస్థితికి దేవుని ఆగ్రహమే కారణం!' అనే చర్చ తెరపైకి వచ్చింది. అవును... దేవుడు ఉన్నాడా..? ఈ సృష్టిని దేవుడే సృష్టించాడా..? ఆయన మనిషి జీవించడం కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రకృతినే.. అతడు గాడి తప్పితే దండించడానికి ఆయుధంగానూ ఉపయోగిస్తాడా..? తాజాగా లాస్ ఏంజెలెస్‌లో జరుగుతున్న దమనకాండ దేవుని ఆగ్రహ ఫలితమేనా..? దేవుడు ఆశీర్వదించిన దేశంగా చెప్పుకునే అమెరికాలో దేవునిపై కొంతమంది చేసిన వ్యాఖ్యల ఫలితమే ఈ పరిస్థితా..? అనే ప్రశ్నలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. ఈ శతాబ్ధ కాలంలో అమెరికా ఎన్నో కార్చిచ్చులను చూసింది! అటవీ ప్రాంతంలో మంటలు మొదలవ్వడం.. అవి తీవ్రమైన గాలుల ఫలితంగా తీవ్రరూపం దాల్చడం.. ఈ సమయంలో రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది విమానాలు, హెలీకాప్టర్ల సహాయం కూడా తీసుకుని వాటిని అదుపుచేయడం. దాదాపు ప్రతీ ఏటా ఏదో ఒక మూల జరుగుతుండే విషయమే! అయితే... తాజా కార్చిచ్చు అందుకు పూర్తీ భిన్నంగా ఉందనే చర్చా నడుస్తుంది. ఈ సందర్భంగా... బైబిల్ లో సొదొమ, గొమొర్రా అనే రెండు నగరాలను గుర్తు చేసుకుంటుంది క్రైస్తవ సమాజం. నాడు ఆ రెండు నగరాల్లోని ప్రజలు తీవ్రస్థాయిలో అదుపుతప్పడంతో దేవుని ఉగ్రతకు గురికావాల్సి వచ్చిందని.. వాటిని అగ్ని, గంధకాలతో దేవుడు దహించివేశాడని.. ఇప్పుడు లాజ్ ఏంజెలెస్ లో జరుగుతున్నదీ అదే తరహా పరిస్థితిలా కనిపిస్తుందనే చర్చ క్రైస్తవ సమాజంలో జరుగుతుంది. ఈ తరహా చర్చ తెరపైకి రావడానికి ఓ బలమైన కారణం ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా... ఇటీవల హాలీవుడ్ లో సినిమాలకు సంబంధించి ఓ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రపంచంలోని చాలా మంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు. అయితే.. ఈ కార్యక్రమంలో యాంకర్ గా వ్యవహరిస్తున్న వ్యక్తి మాట్లాడుతూ.. తమది దేవుడు లేని నగరం అని, దేవుడు లేని స్వర్గమని, తమ నగరానికి దేవుని అవసరం లేదని అన్నారని తెలుస్తోంది. అయితే... సదరు యాంకర్ అలా మాట్లాడిన రెండు రోజుల్లోపే కార్చిచ్చు మొదలవ్వడం, అత్యంత ధనిక నగరం, అందమైన నగరంగా చెప్పుకునే లాస్ ఏంజెలెస్ కాలి బూడిదైపోవడం జరిగిపోయిందని అంటున్నారు. ఈ కార్చిచ్చు వల్ల సుమారు 12,000 కుపైగా నిర్మాణాలు బూడిదవ్వగా.. కొన్ని వేల ఎకరాలు నాశనం అయ్యాయి. ఇక సుమారు రూ.12 నుంచి 15 లక్షల కోట్ల ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో తాజా స్థితిని, నగరం మొత్తం కార్చిచ్చు వల్ల ధ్వంసమైన పరిస్థితిని గమనించిన నిపుణులు... ఈ నగరం తేరుకుని, ఉన్నంతలో పూర్వ వైభవం సంతరించుకుని, ఇక్కడి ప్రజలు నాటి రోజులు చూడటానికి కనీసం దశాబ్ధ కాలం పడుతుందని అంచనా వేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే సొదొమ, గొమొర్రా పట్టణాలను గుర్తు చేసుకుంటుంది క్రైస్తవ సమాజం అని అంటున్నారు. ఏది ఏమైనా... దేవుడు ఉన్నాడా.. లేడా.. అనేది పెద్ద చర్చ! సరైన ముగింపుకు చాలా మంది రాలేని చర్చ అని అంటారు! అందుకు వారి అహం కొంత అడ్డొస్తే... అర్ధజ్ఞానానికీ, అజ్ఞానానికీ కొట్టిమిట్లాడుతూ తాము జ్ఞానులమని భ్రమపడే తత్వం మరో కొంత కారణం అయ్యి ఉండొచ్చని చెబుతున్నారు. ఏది ఏమైనా... లాస్ ఏంజెలెస్ త్వరగా బయటపడాలని, వేగంగా కోలుకోవాలని కోరుకుందామ్!!

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సన్మానించిన ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్





హైదరాబాద్ (గరుడ వార్త) : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ శాలువాతో సత్కరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన అలోక్ ఆరాధేను సుప్రీం కోర్ట్ కొలీజియం సిఫారసు మేరకు బాంబే హైకోర్టుకు పై బదలీపై వెళ్తున్న నేపథ్యంలో, హైకోర్టు ప్రముఖ న్యాయవా ది రాపోలు భాస్కర్ ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధేను శాలువాతో సత్కరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అలోక్ ఆరాధే నిర్వహించిన న్యాయ సేవలు మరువ లేనివని కొనియా డారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తికి ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ తో పాటుగా అతని జూనియర్స్ సుహాస్ చారి తదితర బృందం అంతా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## అందరి సమిష్టి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి

### దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నూతన చైర్మన్ గా లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకారం





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి అందరితో కలిసి తన వంతు కృషి చేస్తానని ఆలయ చైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ(నాని) తెలిపారు. సోమవారం శామీర్ పేట మండలం తూముకుంట మునిసిపల్ పరిధిలోని దేవరయంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నూతన ధర్మకర్తలతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మోహన్ ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి నా పూర్తి సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి అందరు ముందుకు వచ్చి తోడ్పాటు అందియాలని కోరారు. తనపై ఎంతో నమ్మకంతో ఆలయ చైర్మన్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. చైర్మన్ లక్ష్మీనారాయణ తో పాటు ఆలయ ధర్మకర్తలుగా ఎల్లంకి భారతి, వలందాస్ మురళీగౌడ్, బీమిడి నీలంసంజీవరెడ్డి(కొండల్రెడ్డి), నానిగల్ల హరిగోపాల్, గుడినేని హరిక్రిష్ణ, తూంకుంట జగదీశ్ గౌడ్, ఎక్స్ అఫిషియో మెంబర్ కందాల రామాచార్యులు ప్రమాణస్వీకారంచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింలు యాదవ్, మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్, మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ అద్యక్షుడు వేముల మహేష్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు, మాజీ ధర్మకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికులకు ప్రభుత్వమిచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలి

### కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన కల్లుగీత కార్మిక సంఘ సభ్యులు

శామీర్ పేట, (గరుడ వార్త) : కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తప్పక నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉష గౌని వెంకట నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉష గౌని వెంకట నరసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు, మేడ్చల్ జిల్లాలో దాదాపు 20 వేల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదకర వృత్తి అయినప్పటికీ బతుకుదెరువు కోసం ఈ వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. గీతా కార్మికులు చెట్టు పైనుండి పడి చనిపోకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్టులను ఇప్పటివరకు పదివేల మందికి ఇచ్చారని, తొందరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు లక్షల 50 వేల మందికి అందరికీ అందించాలని కోరారు. గీతా కార్మికులందరికీ బైకులు ఇవ్వాలని, చెట్టు పై నుంచి పడి చనిపోయిన కార్మిక కుటుంబాలకు, గాయాలైన కార్మిక కుటుంబాలకు బీసీ కార్పొరేషన్ నుంచి అందించే ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటుచేసిన నీర ప్రాజెక్టును వినియోగించుకొని రాష్ట్రవ్యాప్తంగా నీరాను అందించాలన్నారు. ఈత, తాటి ఉప ఉత్పత్తుల పరిశ్రమలు స్థాపించి గౌడ కులస్తుల యువతి యువకులకు ఉపాధి అవకాశాలు



కల్పించాలని కోరారు. అదేవిధంగా గీత కార్మికులకు ఇచ్చే పెన్షన్ ను నాలుగు వేలకు పెంచాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలని తెలిపారు. పొట్టి రకం ఈత, తాటి చెట్లను పెంచడానికి భూమి లేని సొసైటీలకు 5 ఎకరాల భూమి ఇచ్చి నీటి సదుపాయం కల్పించి సొసైటీలకు తదితరు పది డిమాండ్లతో కూడిన వినతి పత్రం కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కప్పల లింగం గౌడ్, సంఘం నాయకులు జనగాని రాజు గౌడ్, దొంతి ఆంజనేయులు గౌడ్, పంజాల యాదగిరి గౌడ్, చంద్రయ్య గౌడ్, శేఖర్ గౌడ్, ఎం. శ్రీనివాస్ గౌడ్, రోడ్డ లలిత గౌడ్ లు పాల్గొన్నారు.

## ఆశల 'సాగు'రం

గరిడేపల్లి : నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆగస్టులో వచ్చిన వరదలకు ఎగువ జలాశయాలు నిండి దిగువకు భారీగా వరద రావడంతో కొద్ది రోజుల్లోనే సాగర్ నిండింది. నిండిన తర్వాత సైతం వరదలు తగ్గకపోవడంతో సముద్రంలోకి భారీగా నీరు విడుదల చేశారు. అక్టోబరులోనూ వరదలు రావడంతో జలాశయాలు నిండుకుండల్లా ఉండటం, ప్రస్తుత వానాకాలం పూర్తయినా నీటి నిల్వలు తగ్గకపోవడంతో వచ్చే వానాకాలం సాగుపై పూర్తి విశ్వాసం నెలకొంది. నీటిని ఇలాగే ఉంచితే వచ్చే ఏడాది ముందస్తుగానే విడుదల చేపట్టి నాట్లు, వెదజల్లుడు పూర్తి చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగర్ జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587 అడుగుల మేర నీరు ఉంది. అంటే 305 టీఎంసీలు. శ్రీశైలం జలాశయంలోనూ 885 అడుగులకు గాను 866 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా కొంత నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీన్ని నిలువరించితే చాలా వరకు జలాశయంలో నీటి నిల్వలు తగ్గవు.

**అక్టోబరులోనూ వరదలు..**

సాధారణంగా నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా వ్యాపించిన సమయంలో అంటే ఆగస్టు, సెప్టెంబర్లలో కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు పడి వరదలు వస్తాయి. అదే వరదతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుతాయి. ఆ తర్వాత వరదలు వచ్చినా సాగు, తాగునీటి అవసరాలకు పోగా మిగులు నామమాత్రం



గానే ఉంటుంది. సాగర్ జలాశయానికి అక్టోబరులో వచ్చిన వరదను బట్టి సాగర్ కుడి, ఎడమ కాల్వలతో పాటు విద్యుదుత్పత్తి, తాగునీటి అవసరాలకు పోగా సముద్రంలోకి నీటిని వదిలారు. అంటే కేవలం నవంబరు నెలలోనే నిల్వ నీటిని వాడుకున్నారు.

**పొదుపుగా వాడుకుంటే..** ప్రస్తుతం నీటి నిల్వలు రెండు సీజన్‌లకు సరిపోతాయని అధికారులు సైతం పేర్కొంటున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు రాజకీయలకు అతీతంగా విద్యుదుత్పత్తి, కుడి కాల్వకు కేటాయింపులు, ఎడమ కాల్వకు నీటి విడుదల.. అన్నింటిని క్రమపద్ధతిలో నిర్వహిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్త పడవచ్చునని సూచిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో 95 శాతం వరి సాగు చేపడుతున్నందున వచ్చే వానాకాలం సమయానికి వర్షాలు లేకపోయినా సకాలంలో నీరు విడుదల చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. యాసంగి అవసరాలకు పోగా వానాకాలం నాటికి 560 అడుగుల మేర నీరున్నా ఒక పంటకు ఢోకా ఉండదని, ఈలోగా నైరుతి రుతుపవనాలు విస్తరించి వర్షాలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దిగువకు ధరలు.. రైతన్న దిగాలు

సిద్దిపేట : అకాల వానలతో ఓ పంట.. సకాలంలో కురవక మరో పంట.. మద్దతు ధర తగినంత లేక ఇంకో పంట.. ఇలా ఆరుగాలం కష్టపడి జనానికి ఆహారాన్నందించే రైతన్న ఏదోఒక విధంగా నష్టం చూస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు తగ్గిపోయి పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. నవంబరు 31 వరకు ఓ మోస్తరు ఉన్న కూరగాయల ధరలు డిసెంబరులో తగ్గుముఖం పట్టాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలతో పాటు కొన్ని మండలాల్లో కూరగాయలను పండిస్తారు. మండల కేంద్రాల్లో రైతులు పండించిన కూరగాయలను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పలువురు రైతులు స్థానిక మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. మరికొందరు హైదరాబాద్, ఇతర నగరాలకు తరలిస్తున్నారు. 13 రోజుల నుంచి పరిశీలిస్తే టమాటా, బెండ, కాకర,



వంకాయ ధరలు ఎక్కువగా పడిపోయాయి. వాటి సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.6కే 15 కిలోలు..** ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్న సమయంలోనూ సాధారణంగా వంకాయకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. అందుకు భిన్నంగా వంకాయ ధరలు అమాంతం పడిపోయాయి. జిల్లాలో రైతులు వంద ఎకరాల్లో వంకాయ తోటలను సాగు చేశారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుండటంతో అన్ని మార్కెట్‌లలో వంకాయ లభిస్తోంది. రెండు రోజులుగా బహిరంగ మార్కెట్లో వంకాయ రూ. 6కే 15 కిలోల వరకు రైతులు వినియోగదారులకు విక్రయించారు. చేనులో వంకాయ కోసి, రవాణా చేసేందుకు అయ్యే ఖర్చు కంటే అమ్మకంతో తక్కువగా వస్తుండటంతో కొందరు రైతులు మొక్కలపైనే కాయలను వదిలేస్తున్నారు. అద్దెకర పొలంలో రూ. 30 వేలు ఖర్చు చేసి సాగు చేసిన వంకాయ తోటను ధర లేక వదిలి పెట్టానని చిన్నకోడూరు రైతు మల్లేశం తెలిపారు.

**తగ్గడానికి కొన్ని కారణాలు**

దిగుబడి పెరిగింది.

పొరుగు రాష్ట్రాల నుంచి రాక

చిన్న కమతాల్లోనే ఎక్కువ మంది రైతులు వేయడంతో విస్తీర్ణం పెరిగింది.ః టమాటలాంటివి త్వరగా కుళ్లిపోతాయని త్వరగా అమ్మకం మొక్కజొన్న కోతలు, యాసంగి సీజన్ ప్రారంభం మధ్య ఉన్న కొద్ది రోజుల్లోనే కాయగూరలను పండించి ఎంతోకొంతకు అమ్మేయాలనే ఆలోచనతో తగ్గాయి.

పెట్టుబడి రాలేదు– మిద్దెల రమేశ్, చంద్లాపూర్

మాది చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం. గత 15 ఏళ్లుగా 20 గుంటల విస్తీర్ణంలో బెండ తోట సాగు చేస్తున్నా. ప్రస్తుతం 20 గుంటల్లో చేశా. విత్తనం మొదలు ఇప్పటి వరకు రూ. 15 వేలు పెట్టుబడి ఖర్చు అయింది. రెండు సార్లు మాత్రమే బెండకాయలు కోశా. కూలీలకు సైతం డబ్బులు రావడం లేదు. సరైన ధర లేక పోవడంతో పంటను మొక్కలపైనే వదిలేశా. పదిహేనేళ్లలో ఇంత తక్కువ ధర ఎప్పుడూ రాలేదు.

# నాగారం.. కొలువుల్లో సింగారం

ధర్మపురి : ధర్మపురి మండలంలోని నాగారం గ్రామం మారుమూల ప్రాంతం. ఇక్కడి ప్రజలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కనీసం బస్సు సౌకర్యం కూడా లేదు. మెరుగైన సదుపాయాలు లేకపోయినా ఇక్కడి యువత ప్రభుత్వ కొలువులు సాధిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 800 మంది ఓటర్లు ఉన్న నాగారంలో సుమారు ఇరవై మంది యువత వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇందులో అయిదుగురు ఆర్మీలో, మరొకరు బీఎస్ఎఫ్, మరొకరు ఇండో టిబెటన్ బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఉన్నారు. ఇద్దరు ఎస్సైలుగా, ఒకరు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పలువురు డాక్టర్లుగా స్థిరపడ్డారు. మరికొంత మంది ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. విదేశాల్లో పలువురు ఉన్నతోద్యోగాల్లో ఉన్నారు. ఉన్నత చదువులు చదివి అయిదుగురు అధ్యాపకవృత్తిని చేపట్టారు. ఈ గ్రామంలో మొదటగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగం సాధించగా వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎంతోమంది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఉన్నత చదువులు చదివేందుకు మొగ్గు చూపారు. ఫలితంగా మారుమూల ప్రాంతం నుంచి చాలామంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సీనియర్ల మార్గదర్శనంలో తాము విద్యాభ్యాసం చేస్తున్నామని వారి సూచనలు సలహాలు పాటిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని ఇక్కడి



యువకులు చెబుతున్నారు.

**దేశ సేవ చేయాలని**

దేశసేవ చేయాలన్న లక్ష్యంతో ఆర్మీ ఎంపిక శిబిరంలో పాల్గొన్నా. 2009 మార్చి 27న ఉద్యోగంలో చేరాను. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో శిక్షణ కేంద్రంలో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నా. ఇదే స్ఫూర్తితో గ్రామంలోని పలువురు రక్షణ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామం నుంచి వివిధ భద్రతా దళాల్లో యువత విధులు నిర్వహించడం ఆనందంగా ఉంది. చాలా మందికి ఉద్యోగాలు రావడంతో గ్రామంలో ప్రోత్సాహకర వాతావరణం ఏర్పడింది. మెడిశెట్టి శ్రీనివాస్, ఆర్మీ హవల్దార్

పట్టుదలతో రాణించా

మొదటి నుంచీ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసించాను. ఆంగ్లంపై ఇష్టంతో భాషపై పట్టు సాధించా. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 13వ ర్యాంకు సాధించి సారంగాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో గ్రామంలో యువత ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. పలువురిని స్ఫూర్తిగా తీసుకొని పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారు. జంగం సత్యం

# కలిసికట్టుగా వ్యూహ రచన



కరీంనగర్ : ఇన్నాళ్లు చేసిన పనులకు బిల్లులు రావడంలేదని.. సాధారణ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై ఆసక్తి చూపని గుత్తేదారులు.. ఇప్పుడు నిధులున్నా వాటికి పోటీ లేకుండా చక్రం తిప్పుతున్నారు. అంచనాల రేట్లకే పనులు దక్కించుకునేలా ముందస్తు వ్యూహ రచన చేశారు.

**టెండర్ల ఆహ్వానం..**

కరీంనగర్ బల్దియాతోపాటు సుడా పరిధిలోని అభివృద్ధి పనులకు ఈప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించారు. సుమారు రూ.4 కోట్లతో 55 పనులు ఉండగా, సీసీ రోడ్లు, మురుగుకాలువలు, శ్మశానవాటిక ఆధునికీకరణ, హైమాస్ట్ వీధిదీపాలు, ఆర్‌సీసీ పైపులైను డ్రైనేజీలు, బోర్‌వెల్, పైపులైను వంటి పనులు ఉన్నాయి. సుడా పరిధిలో 18 పనులు ఉండగా ఈనెల 17లోగా, ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) 38 పనులకు ఈనెల 16 వరకు టెండర్ల గడువు ముగిసింది. మూడు పనులకు ఎవరూ ముందుకు రాలేదు. ఒక పనికి నలుగురు గుత్తేదారులు పోటీపడినట్లు తెలిసింది.

**చేతులు మారిన రూ.30 క్షల నగదు**

వారం రోజులుగా గుత్తేదారులు అభివృద్ధి పనులను దక్కించుకోవడానికి దృష్టి సారించారు. గుత్తేదారుల సంక్షేమ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. టెండర్లలో పాల్గొనే 60 మంది గుత్తేదారులు రూ.30 వేల చొప్పున ముందస్తుగా డిపాజిట్ చేశారు. ఇలా రూ.18 లక్షలు జమ చేసినట్లు సమాచారం. ఒక్కో పని మీద 15 శాతం మించకుండా వేలంపాట నిర్వహించారు. మరో మార్గంలో రూ.12 లక్షలు సేకరించగా.. మొత్తం రూ.30 లక్షలు కాగా పనులు చేయని గుత్తేదారులకు వాటిని చెల్లించనున్నారు. పోటీ లేకుండా అంచనా ధరలకే టెండర్లలో పాల్గొంటుండటంతో సుడా, బల్దియా ఖజానాలకు ఎలాంటి లాభం లేకుండా పోతుంది.

**ముందస్తు ప్రణాళికతోనే..**

సుడా, ప్రత్యేక అభివృద్ధి నిధులకు సంబంధించిన అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ టెండర్ పిలవడంతో ఎక్కడి నుంచైనా పాల్గొనే వీలుంది. పోటీ లేకుండా వీటిని దక్కించుకోవడానికి ఇతరులు ఇందులో పాల్గొనకుండా ముందుగానే కట్టడి చేసుకున్నట్లు తెలిసింది.

# గనులు తవ్వుకో.. అందినంత దోచుకో!



సిరిసిల్ల : గనుల తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వం 2020లో మైనింగ్‌శాఖ అనుమతి ఉన్న గనులను డీజీపీఎస్ ద్వారా సర్వే చేసింది. వారి అనుమతి ఉన్న మేరకు హద్దులు నిర్ణయించింది. వీటిని జియోట్యాగింగ్ కూడా చేశారు. ఆ తర్వాత నుంచి రెవెన్యూ, గనుల శాఖలు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్న గనులను ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే చేసేందుకు గనులశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 91 క్వారీలను గనులశాఖ నిషేధిత జాబితాలో పెట్టింది. అయినా ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ సీనరేజి ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో కంకర క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపారని గనులశాఖ ఆగస్టులో డిమాండ్ నోటీసు జారీ చేసింది. అలాగే రుద్రంగిలోని క్రషర్ అడవికి సమీపంలో ఉంది. నోటీసులు జారీ చేసినా యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లిలో అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన తరవాత కొన్ని రోజుల పాటు క్వారీని నడపలేదు. తర్వాత యథావిధిగా కొనసాగిస్తున్నారు.

గనుల తవ్వకాలు పెరగడం, నిబంధనలు పాటించకపోవడంతో వాటి చుట్టూ పర్యావరణంపై ప్రభావం చూపుతోంది. 1994 ఉత్తర్వుల ప్రకారం అయిదు హెక్టార్లకు మించి గనుల్లో చిన్న ఖనిజాలకూ పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేసింది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని కంకర, గ్రానైట్ క్వారీల్లో ఉల్లంఘనలు ఎక్కువగా జరిగాయి. వీటిలో లీజు గడువు దాటినా హద్దులు మీరి తవ్వకాలతోపాటు అనుమతి తీసుకోకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పన్నులు ఎగవేస్తున్న వాటిని గుర్తించారు. వీటి ద్వారా ప్రభుత్వానికి కట్టాల్సిన పెనాల్టీ రూ.కోట్లలో ఉంటుందని గనులశాఖ అధికారులు అంచనా వేశారు. వీటికి ప్రభుత్వం నోటీసులు కూడా జారీ చేసింది. 2012లో అన్ని క్వారీలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేశారు. లీజు ముగిసిన గనుల్లో రెన్యువల్ కాని చోట్ల మళ్లీ తవ్వకాలు జరగకుండా గనులశాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ జిల్లాలో చాలా చోట్ల గడువు ముగిసిన తర్వాత కూడా ఏళ్ల తరబడి తవ్వకాలు జరిగినట్లు తెలుస్తోంది.

మైనింగ్ లీజు తీసుకున్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణంలో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి రాయల్టీ ఎగవేసే క్వారీ యజమానులపై కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. క్వారీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు అక్కడ తవ్వకాలు, మెటీరియల్ తరలింపులపై రెవెన్యూ శాఖ పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. కొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

**నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్నవాటిని గుర్తించాం**

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్న క్వారీలు, క్రషర్లను గుర్తించి ఉత్తర్వులు జారీ చేశాం. వీటిని పర్యవేక్షించాలని తహసీల్దార్లు, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాం. కొందరు యజమానులు ముందుకొచ్చి పెనాల్టీలు చెల్లిస్తున్నారు. క్రాంతి కుమార్, సిరిసిల్ల గనులశాఖ ఏడీ

# మహిళా సంఘాలు.. సౌర వెలుగులు

సిరిసిల్ల : మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఒక్కో సంఘానికి 35 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. ప్రభుత్వ, దేవాదాయశాఖ భూముల్లో వీటిని ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను స్థానిక స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తారు. డిసెంబరులో రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన సంస్థ (రెడ్కో) ఆధ్వర్యంలో డిసెంబరులో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వచ్చే వారంలో టెండర్లు తెరవనున్నారు. గుత్తేదారు సంస్థలను ఖరారు చేయనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలు సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల అన్వేషణలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రామగుండం, ఎన్టీపీసీ, ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరులలో 150 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఉన్నాయి. వీటికి తోడు మహిళా సంఘాలవి కూడా రాబోతున్నాయి. ఒక సంఘానికి రెండు మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు అవకాశం ఉంది. ఒక మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు సుమారు రూ.3. కోట్ల నుంచి రూ.3.5 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. దీనిలో సంఘం మార్జిన్ మనీ కింద పది శాతం చెల్లించాలి. మిగతాది బ్యాంకు రుణంగా అందిస్తుంది. ప్లాంటు జీవితకాలం 25 సంవత్సరా



లు. సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు యూనిట్‌కు నిర్ణయించిన ధరల మేరకు డిస్కంలకు విక్రయిస్తున్నారు. నిర్వహణ ఖర్చు తక్కువగా ఉండటంతో లాభం ఎక్కువగా ఉంటుంది.

600 ఎకరాలు అవసరం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో జిల్లాకు 150 ఎకరాలు అవసరం. ఒక మెగావాట్ యూనిట్‌కు నాలుగు ఎకరాల స్థలం అవసరం. సిరిసిల్ల జిల్లా నామాపూర్‌లో 40 ఎకరాలు, కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రేగులపల్లిలో 20 ఎకరాలు, జగిత్యాలలో 15 ఎకరాల మేరకు ప్రాథమికంగా గుర్తించారు. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రదేశాలలో వీలైనన్ని ఎక్కువ ప్రదేశాలలో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా డీఆర్డీఏ, గ్రామైక్య సంఘాలు స్థలాలను పరిశీలిస్తున్నాయి. ప్రభుత్వం సౌరవిద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించనుంది. దానిలో పూర్తి విధివిధానాలు అందుబాటులోకి ఉంటాయి.

# వ్యక్తిగత మరుగుదొడ్ల నిధులు వెనక్కి!

మల్లాపూర్ : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 2014-2015లో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నీటిపారుదల పారిశుద్ధ్య కమిటీ(వీడబ్ల్యూఎస్)ల ఆధ్వర్యంలో బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నియంత్రించాలన్న ఉద్దేశంతో పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గతంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి రూ.12వేలు అందజేస్తూ వచ్చింది. కేంద్రప్రభుత్వం వాటా రూ.7200, రాష్ట్రప్రభుత్వం వాటా రూ.4800 చొప్పున చెల్లిస్తూ వచ్చారు.

పల్లెల్లో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంగా గతంలో మంజూరు చేసిన నిధులను ఇటీవల కలెక్టర్ ఖాతాల్లోకి మళ్లించారు. 2021-2024 మధ్య కాలంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అందజేసేందుకు మంజూరైన నిధులు పంచాయతీల్లో పేరుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా రూ.2.55 కోట్ల నిధులను తక్షణమే కలెక్టర్ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వులు వెలువడటంతో డిసెంబర్ నెలాఖరులో ఆయా పంచాయతీల కార్యదర్శులు మిగిలిపోయిన నిధులను చెక్కుల రూపంలో కలెక్టర్ ఖాతాకు బదిలీ చేశారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో రూ.22.44 లక్షలు, బుగ్గారం రూ.4.71 లక్షలు, ధర్మపురి రూ.15.77 లక్షలు, గొల్లపల్లి రూ.57.53 లక్షలు, ఇబ్రహీంపట్నం రూ.25.45 లక్షలు, జగిత్యాల రూ.7.43 లక్షలు, జగిత్యాల గ్రామీణం రూ.2.70 లక్షలు, కథలాపూర్ రూ.5.40 లక్షలు, కోరుట్ల రూ.11.48 లక్షలు, మల్లాపూర్ రూ.16.73 లక్షలు, మల్యాల రూ.2.14 లక్షలు, మేడిపల్లి రూ.6.52 లక్షలు, మెట్‌పల్లి రూ.17.59 లక్షలు, పెగడపల్లి రూ.3.78 లక్షలు, రాయికల్ రూ.30.40 లక్షలు, సారంగాపూర్ రూ.25.13 లక్షల చొప్పున కలెక్టర్ ఖాతాకు బదిలీ అయ్యాయి. వెల్గటూర్, కొడిమాల్య మండలాల్లో నిధులు లేవు. గతంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌ల సమక్షంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను గుర్తించి నిధులు అందజేసేవారు. అక్రమాలకు తావు లేకుండా - రఘువరన్, డీఆర్‌డీఏ పీడీ, జగిత్యాలరాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల్లో నిల్వ ఉన్న నిధులను వెనక్కి తీసుకొని కలెక్టర్ ఖాతాలో జమ చేశాం. జిల్లాలో కొత్తగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ.12 వేలు రెండు విడతలుగా ప్రభుత్వం జమ చేస్తుంది. గతంలో ఉన్న నిబంధనలను సవరించి అక్రమాలకు చోటులేకుండా చేయాలన్న తలంపుతో ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

# ప్రయోగశాలలు లేవు.. సామగ్రి రాదు!

ఎల్లారెడ్డిపేట: కేజీబీవీల్లో ప్రయోగశాలలు, అందుకు సంబంధించిన సామగ్రి లేకపోవడంతో అందులో చదువుకునే ఇంటర్ విద్యార్థినుల ఫలితాలపై ప్రభావం పడనుంది. 2022-23 విద్యా సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో ఇంటర్ తరగతులను ప్రారంభించింది. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలను సీసీ కెమెరాల కింద నిర్వహించాలని నిర్ణయించగా.. ఆ మేరకు విద్యా ర్థుల సన్నద్ధతపై దృష్టి పెట్టలేదు. వచ్చే నెల 3 నుంచి 22 వరకు ప్రయోగ పరీక్షలు జరగనుండగా.. ప్రయోగశాలలు లేక విద్యార్థినులు సాధనకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరిని దగ్గరిలోని జూనియర్ కళాశాలలకు తీసుకెళ్లి సాధన చేయిస్తుండగా.. మరికొందరికి ఎల్ఈడీ తెరలపై చూపిస్తున్నారు. ఇలా ప్రయోగాలు అర్థం కావడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎల్ఈడీ తెరలపై..**

జిల్లాలో 7 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. ఈ పాఠశాలలు కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. విద్యార్థినులకు ప్రత్యేక భవనాలు నిర్మించి విద్యా బోధన చేస్తున్నారు. రామగుండం, జూలపల్లి, అంతర్గాం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, గర్రెపల్లి పాఠశాలల్లో 160 మంది చొప్పున 1,120 మంది అమ్మాయిలు చదువుతున్నారు. ప్రయోగ గదులు, సంబంధ సామగ్రి లేక సైన్స్ గ్రూప్ విద్యార్థులకు ఎల్ఈడీ తెరలపై ప్రాక్టికల్స్ తరగతులు చెబుతున్నారు. పరీక్షల సమయానికి ముందు దగ్గర్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు తీసుకెళ్లి సాధన చేయిస్తున్నారు. జూనియర్ కళాశాల లేని చోట ప్రయోగాలు చేయించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**అర్థం కావడం లేదు**

ఎల్ఈడీ తెరపై ప్రయోగాల తరగతులు అర్థం కావడం లేదు. నేరుగా సాధన చేయిస్తేనే ఉపయోగంగా ఉంటుంది. అప్పుడు పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించగలం. పరీక్షలకు ముందు స్థానిక జూనియర్ కళాశాలలో ప్రయోగాలు చేయించారు. మా కళాశాలలోనే ప్రయోగ గదులు నిర్మించి.. సాధన చేయించాలి. కె.అర్చన, ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం, కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ

**తరచూ సాధనతోనే..**

మా కళాశాలలో ప్రయోగశాల లేకపోవడంతో పరీక్ష సమయానికి ముందు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. తరచూ ప్రయోగాలు సాధన చేస్తేనే పాఠాలు అర్థం అవుతాయి. అప్పుడే మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి మా కళాశాలలో ప్రయోగశాల ఏర్పాటు చేయాలి. టి.అక్షయ, బైపీసీ ద్వితీయ సంవత్సరం, ఓదెల కేజీబీవీ

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థులు ప్రయోగాల సాధనకు కొంత సామగ్రి సమకూర్చాం. పూర్తి స్థాయిలో ప్రయోగశాలలు ఏర్పాటు చేయడానికి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాలు రాగానే పూర్తిస్థాయిలో ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తాం. జిల్లా డిప్యూటీ సమన్వయకర్త(జీసీడీవో) కవిత

# నెరవేరిన కల



జగిత్యాల : కేంద్రప్రభుత్వం సంక్రాంతి కానుకగా నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డును ప్రారంభించింది. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో పసుపుబోర్డును ఏర్పాటు చేస్తామని 2023 అక్టోబరు 2న ప్రకటించగా అదే నెల 4న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ప్రస్తుతం నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటుతో కర్షకుల ఏళ్లనాటి కల నెరవేరినట్లయింది. తెలంగాణలో నిజామాబాద్ తర్వాత జగిత్యాల జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో పసుపు పంటను సాగుచేస్తున్నారు. దేశంలో కొన్ని పంటలకు ప్రత్యేక బోర్డులుండగా పసుపుమాత్రం సుగంధద్రవ్యాల బోర్డులోనే ఒక పంటగా ఉంది. భారతదేశం నుంచి సుగంధ ద్రవ్యాలబోర్డు ద్వారా రూ.11 వేల కోట్ల విలువైన పంట ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. మిరప, అల్లం, ధనియాలు, మిరియాలు తదితర చాలా పంటలతో పాటు పసుపును కూడా సుగంధ ద్రవ్యాలబోర్డు ద్వారానే పంపిస్తారు. అన్నిరకాల పంటలకు కలిపి ఒకేబోర్డు ఉండటంతో అదనపు ప్రయోజనాలు కలగనందున పసుపు పంటకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ వచ్చారు. పసుపు బోర్డుఏర్పాటు, క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర డిమాండ్‌తో 2019 పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 176 మంది పసుపు రైతులు పోటీపడి తమ అభిమతాన్ని బలంగా చాటారు. పోటీపడ్డ రైతుల్లో జగిత్యాల జిల్లా రైతులు కూడా ఉన్నారు. గెలిచిన 100 రోజుల్లో బోర్డును ఏర్పాటు చేస్తామని ధర్మపురి అర్వింద్ రైతులకు బాండ్‌ను కూడా రాసిచ్చారు. నిజామాబాద్‌లో సుగంధద్రవ్యాల ప్రాంతీయ కార్యాలయాన్ని మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. తర్వాత నిజామాబాద్‌ను పసుపు హబ్‌గా ప్రకటించారు.

**పరిశోధనలతో ప్రయోజనాలు..**

ప్రస్తుతం పసుపు పంటను సుగంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీసి నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపుబోర్డును ఏర్పాటు చేయటంతో రైతులకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. పసుపు పంటపై స్థానికంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టి ఇక్కడి పరిస్థితులకు అనువైన వంగడాలను ఉత్పత్తి చేస్తారు. అత్యధిక కర్కుమిన్(పసుపు) శాతం కలిగిన రకాలు ఉత్పత్తిచేస్తే మార్కెట్లో అధిక ధర దక్కుతుంది. చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులోకి వస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. రైతులకు యంత్రపరికరాలు రాయితీపై అందుతాయి, రుణాలు, శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి సలహాలు దరిచేరతాయి. పసుపును నిల్వచేసే శీతల గిడ్డంగులు నిర్మిస్తారు. పసుపు పాలిషింగ్, రంగులు, మందులతయారీ కంపెనీలను రాయితీపై ఇవ్వటంతో యువతకు ఉపాధి లభిస్తుంది. స్థానికంగానే పరిశ్రమలతో ధరల్లో స్థిరత్వం ఉంటుంది. గతంలో పసుపు ఎగుమతులను కేంద్రం పర్యవేక్షించగా నిజామాబాద్‌లో బోర్డు ఏర్పాటుతో నేరుగా ఇక్కడ్నుంచే విదేశాలకు ఎగుమతి సాధ్యపడుతుంది. దేశంలో మహారాష్ట్రలోని సాంగ్లీ, తమిళనాడులోని ఈరోడ్ తర్వాత నిజామాబాద్ మార్కెట్లోనే అత్యధికంగా పసుపు క్రయవిక్రయాలు సాగుతుండగా జగిత్యాల జిల్లా రైతులూ నిజామాబాద్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నేరుగా నిజామాబాద్ నుంచే ఉత్పత్తులను తీసుకునే వీలుకలిగి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సాగు, ఉడికించి ఆరబెట్టడంలో మెలకువలతో నాణ్యమైన ఉత్పత్తులు చేతికివచ్చి అధిక ధరలు లభిస్తాయి.

**ధరల్లో స్థిరత్వం** పన్నాల తిరుపతిరెడ్డి, లక్ష్మీపూర్

ఎన్నో వ్యయప్రయాసలకోర్చి 176 మంది 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీపడగా బోర్డు ఏర్పాటు రైతుల విజయంగా చెప్పవచ్చు. జాతీయ పసుపుబోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేయటం ఇక్కడి రైతులకు దీర్ఘకాలికంగా ఎంతో ఉపకరించనుంది.

# వైద్య సేవల పథకంపై స్పష్టత ఏదీ..!

గోదావరిఖని : సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల వైద్య సేవల కోసం అమలు చేస్తున్న సీపీఆర్ఎంఎస్ పథకంపై ప్రచారం కరవైంది. కోల్ ఇండియా స్థాయిలో కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో సీపీఆర్ఎంఎస్ (కాంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ మెడికేర్ స్కీం) కొత్తవారు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి వరకు గడువు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. కోల్ ఇండియాలో దీనికి సంబంధించిన ప్రచారం చేయడంతో పాటు విశ్రాంత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా సింగరేణిలో మాత్రం ఇప్పటి వరకు దీనికి సంబంధించిన ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. కనీసం గడువు పెంచిన విషయంపై కూడా ప్రచారం చేయడం లేదు. ఆయా అంశాలపై ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేయాల్సిన యాజమాన్యం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బొగ్గుగని కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం అనేక జబ్బులతో బాధపడే అవకాశం ఉందని జేబీసీసీఐలో దీని కోసం చర్చించి ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. 2018 ఏప్రిల్ నుంచి ఈ పథకం సింగరేణిలో అమలులోకి వచ్చింది. ఇప్పటి వరకు 32 వేల మంది విశ్రాంత ఉద్యోగులు వైద్య సేవలు పొందుతున్నారు. తాజాగా మరింత మందికి అవకాశం కల్పించేందుకు కోల్ ఇండియా యాజమాన్యం జారీ చేసిన ఆదేశాలను సింగరేణిలో అమలు చేసేందుకు అంతర్గత ఆదేశాలు జారీ చేసి గనులపై ప్రచారం చేయాల్సి ఉంటుంది. నేటికీ ఆ దిశగా చర్యలు కరవయ్యాయి. దంపతులకు రూ.8 లక్షల పరిమితి గనుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికుల దంపతులు రూ.8 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. దీనిని రూ.15 లక్షలకు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కోల్ ఇండియాలో సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినప్పటికీ దీనిపై పక్కాగా ఆదేశాలు రాలేదు. ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికుల దంపతులకు రూ.15 లక్షల వరకు పరిమితి ఉంటే పూర్తిస్థాయిలో వైద్యం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఒత్తిడి తెచ్చారు. ఇందుకు విశ్రాంత కార్మికులు రూ.40 వేలు చెల్లించి సీపీఆర్ఎంఎస్ పథకంలో సభ్యులుగా చేరాలి.

## పరస్పర సహకారంతో ముందుకు!

హైదరాబాద్ : జంట నగరాల్లో రెవెన్యూ, రక్షణ శాఖ భూములకు సంబంధించిన అంశాలు, వివాదాలపై రెండు శాఖల అధికారులు పరస్పరం సహకరించుకోవాలన్న నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రక్షణ శాఖ అధికారులు ఇటీవల సమావేశమయ్యారు. ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రోరైల్ నిర్మాణంలో బొల్లారం, తిరుమలగిరి ప్రాంతాల్లో రక్షణ శాఖకు చెందిన భూములను ఇచ్చేందుకు అధికారులు సుముఖత వ్యక్తంచేశారు. బదులుగా.. తాము కోరుకున్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములివ్వాలని కోరారు. తిరుమలగిరి, బొల్లారం, గోల్కొండ, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో కొన్నిచోట్ల రక్షణశాఖ భూములను కొందరు ఆక్రమించారు. ఆక్రమణలు తొలగించి వాటిని రక్షణ శాఖకు తిరిగి స్వాధీనం చేస్తామంటూ రెవెన్యూ అధికారులు తెలిపారు.

**రహదారుల విస్తరణ.. సాఫీగా ట్రాఫిక్**

నగరంలో రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రక్షణ



శాఖ భూములను కోరనున్నారు. మెహిదీపట్నం, గోల్కొండ, ఆసిఫ్‌నగర్, కంటోన్మెంట్, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్ ప్రాంతాల్లో భూములివ్వాలని ప్రతిపాదించనున్నారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు ఎలివేటెడ్ కారిడార్లకు సమాంతరంగా రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు.

**వివాదాలకు చెక్ పెట్టేలా..**

హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ భూములు, రక్షణ శాఖకు చెందిన భూములపై దశాబ్దాలుగా వివాదాలు కొనసాగుతున్నాయి. కంటోన్మెంట్, తిరుమలగిరి, ఆసిఫ్‌నగర్, కంచన్‌బాగ్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములు, కబ్జాలకు గురైనవాటిపై అధికారులు పూర్తి వివరాలను సేకరించారు. కొన్నింటిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని తెలుసుకున్నారు. రక్షణ శాఖ భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు సహకరించనున్నారు. మండల పరిధిలో రికార్డులు, సర్వే నంబర్లను అప్పగించనున్నారు. సైనిక స్కూల్‌కు కేటాయించిన భూములను రక్షణశాఖకు అప్పగించేందుకు అవసరమైన ప్రక్రియను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయనున్నారు. కంచన్‌బాగ్‌లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూవివాదాలను సత్వరమే పరిష్కరించనున్నారు.

## అందని జలం.. అన్నదాత కలవరం

పెద్దేముల్ : ఆ ప్రాంతంలో చెరువులు ఏమీ లేవు. వర్షం పడితేనే పంట పండాలి. మండలంలోని నాగులపల్లి అడవి మధ్యలో పూర్వం మల్కన్‌దాన్ చెరువు ఉండేది. దాని ఆనవాళ్లను గుర్తించి అదే పేరుతో కొత్తగా నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. వారి వినతి మేరకు అటవీ ప్రాంతంలో గుట్టలపై కురిసిన వర్షపు నీటిని ఒడిసిపట్టి జల సౌభాగ్యం కల్పించాలని అప్పటి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. రుద్రారం, నర్సాపూరు, గోపాల్‌పూరు, నాగులపల్లి గ్రామాల పరిధిలో వేల ఎకరాల భూములు ఉన్నాయి. రైతులంతా వర్షాధార పంటలు పండిస్తూ వస్తున్నారు. ఈ ప్రాంత రైతుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని 2010లో కొత్తగా మల్కదాన్ చెరువు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు మూడేళ్లలో మట్టికట్ట, తూములు, షట్టర్లు, అలుగు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఏటా కొద్దిపాటి వర్షాలకు నిండి అలుగు పారుతోంది. సుమారు పదేళ్లుగా నీరంతా వృథా అవుతోంది.

కలగానే కాల్వల నిర్మాణం: పొలాలకు నీరు పారేందుకు కాల్వల నిర్మాణానికి అధికారులు భూ సేకరణ చేపట్టారు. పరిహారం కింద ఎకరాకు రూ.3 లక్షలు నిర్ణయించారు. అయితే రైతులు అంగీకరించకపోవడంతో చివరికి రూ.5.50 లక్షల పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. భూముల కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించి జాబితాను తయారుచేశారు. 38 మంది రైతుల నుంచి 12ఎకరాల 13 గుంటల భూమిని సేకరించారు. మొత్తం రూ.67,78,750 రైతుల ఖాతాల్లో జమ చేశారు. అయితే నీటిపారుదల అధికారులు అప్పటికే చెరువు నిర్మాణం పూర్తి అయినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. నిర్మాణం కలగానే మిగిలింది.

**ఎదురుచూస్తున్నాం- రాములు, రైతు, నాగులపల్లి.**

చెరువు కింది భాగంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పత్తి, కంది పంటలను సాగు చేసుకుంటున్నాం. కాల్వల నిర్మాణం జరిగితే నీటి వసతి కలుగుతుంది. చెరకు, కూరగాయ, పసుపు పంటలను సాగు చేస్తున్నా. అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాలపైనే ఆధార పడుతున్నాం.

## 26 నుంచి రేషన్‌కార్డుల జారీ

హైదరాబాద్: గ్రేటర్‌లో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వేగం పుంజుకుంది. అర్హులను గుర్తించేందుకు బల్దియా కమిషనర్ ఇలంబర్తి ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. 150 డివిజన్లలో దరఖాస్తుదారులను పరిశీలించారు. ఈనెల 24 నాటికి అర్హుల ఎంపికను పూర్తిచేసి, 25న నివేదికను ఆయా జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. అర్హులను ప్రభుత్వం వద్దనున్న సమాచారంతో సరిచూసి, 26నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్టు



సమాచారం. కొనసాగుతున్న పరిశీలన: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టింది. గ్రేటర్‌లో 22 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేసింది. అందులో రేషన్‌కార్డు లేదని, కొత్త కార్డు కావాలనే అభ్యర్థనలు అందాయి. పరిశీలన అనంతరం 83,285గా లెక్క తేల్చింది. ఇటీవల ఇంటింటి సర్వేలోనూ అనేక మంది రేషన్‌కార్డులు లేనివారు వివరాలు నమోదు చేయించుకున్నారు. కొన్నేళ్లుగా కొత్తకార్డులు ఇవ్వకపోవడం, జన్మించిన శిశువులు, కొత్తగా వచ్చిన కోడళ్ల పేర్లను రేషన్‌కార్డుల్లో చేర్చాలంటూ వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకునే అంశంపై రెండు రోజుల్లో ఆదేశాలు వెలువడవచ్చు.

# ఏమాత్రం చలించరా?



హైదరాబాద్ : ఉష్ణోగ్రతలు రోజురోజుకు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ఉదయం తొమ్మిదైనా.. చలి తగ్గట్లే. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులతో పాటు వచ్చిన సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రుల వద్ద ఉన్న అరకొర షెడ్లు ఎటూ చాలడం లేదు. వాటికి పైకప్పు ఉన్న చుట్టూ ఎలాంటి గోడలు లేకపోవడంతో చలిగాలి తీవ్రతతో వణికిపోతున్నారు. నిమ్స్, నిలోఫర్, ఉస్మానియా, ఎంఎన్‌జే, గాంధీ, పేట్లబుర్జు ప్రభుత్వ దవాఖానాల్లో రాత్రి అయితే పరిస్థితి దయనీయం. వైద్యం కోసం వచ్చిన రోగులు వారి సహాయకులకు సరైన షెల్టర్లు లేక ఆరుబయట చలిలోనే గడుపుతున్నారు. చుట్టుపక్కల చెత్తా చెదారంతో దోమల బెడద తప్పడం లేదు. మరోవైపు దోమల రొద తప్పడం లేదు.

**ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తే..**

ప్రధాన ఆసుపత్రులకు అన్ని ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో రోగులు వారితోపాటు సహాయకులు వస్తుంటారు. కొందరు రెండు, మూడు లేదంటే వారం రోజులపాటు ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో పేదలే అధికం. బయట హోటళ్లల్లో ఉండే ఆర్థిక స్థోమత వారికి ఉండదు. దీంతో ఎన్ని ఇబ్బందులు ఉన్నాసరే ఆసుపత్రి ఆవరణలోనే చాలామంది రోగులు, సహాయకులు గడుపుతుంటారు. రోగులను ఆసుపత్రిలో చేర్చాక వారితోపాటు సహాయకులుగా ఒక్కరినే లోపలికి అనుమతిస్తారు. మిగతా ఎంతమంది ఉన్న బయటే వేచి చూడాలి. ముఖ్యంగా చలి కాలంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాంధీ, నిమ్స్‌లో చిన్న షెడ్లు ఉన్నాయి. ఇవి అతి తక్కువ మందికే సరిపోతున్నాయి. వాటికి కూడా చుట్టూ గోడలు లేకపోవడంతో షెడ్ కింద ఉన్న ఆరుబయట ఉన్నట్లే అనిపిస్తుంది. వణికించే చలిలో ముడుచుకొని కాలం గడుపుతున్నారు. కొందరైతే 10-15 రోజులు ఆరు బయటే కాలం గడుపుతున్నారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో కొన్నిసార్లు నెలలుగా నిరీక్షించాల్సి వస్తోందని పలువురు తెలిపారు. **స్వచ్ఛంద సంస్థల సాయం..**నిమ్స్, గాంధీ, ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద కొన్ని స్వచ్ఛంద సంస్థలు రోగులు, వారి సహాయకులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నాయి. కొందరు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా రోగులు, వారి సహాయకులు వేచి ఉండేలా అన్ని సౌకర్యాలతో కూడిన పక్కా గదులు ఏ ఆసుపత్రిలో లేవు. దోమలు కుట్టిన, చలి వేధించినా సరే... ఆసుపత్రి ప్రాంగణంలో చెట్టు నీడన, మెట్ల పక్కన నిరీక్షించాల్సిన పరిస్థితి.

# పనులే వద్దు.. ఈ బిల్లులేంటి?




హైదరాబాద్ : కాలనీవాళ్లు అడిగారని, రోడ్లపై గుంతలు పడ్డాయని అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపితే.. మీ ఉద్యోగాలు పోతాయంటూ ఇంజినీర్లను జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయం పరోక్షంగా హెచ్చరించింది. ఇప్పటి వరకు మీరు చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తామంటూ భయపెట్టింది. అభివృద్ధి పనుల బిల్లులతో పాటు బల్దియా ఖాతాలో సెక్యూరిటీ డిపాజిట్ల కింద గుత్తేదారులు జమ చేసే ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లింపులకు ఆమోదం తెలిపే దస్త్రాలపైనా కేంద్ర కార్యాలయం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కొన్ని నెలలుగా బల్దియా ఇంజినీర్లకు ఈ తరహా ఒత్తిడి నిత్యకృత్యమైంది. దీంతో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు జరగట్లేదు. నగరవాసుల అభ్యర్థనలు అటకెక్కుతుండగా.. సమస్యలు నానాటికీ పెరుగుతున్నాయి.

**మళ్లీ టెండర్లేవీ?**

గత సర్కారు కాలనీ రోడ్లు, నాలాలు, శ్మశానవాటికల్లో సౌకర్యాల కల్పన, ఇతరత్రా పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలంటూ జూన్ 28, 2023న జీహెచ్‌ఎంసీకి ఆదేశాలిచ్చింది. పనులకు సిద్ధమవుతుండగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తరువాత కొత్త సర్కారు అధికారంలోకి రావడంతో ఆ పనులన్నింటినీ రద్దు చేశారు. తిరిగి టెండర్లు పిలుస్తామని అప్పట్లో అధికారులు చెప్పినా అమలుకు నోచుకోలేదు. రూ.54 లక్షలతో మల్లాపూర్ డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో, రూ.51 లక్షలతో హబ్సిగూడ డివిజన్‌లో, రూ.53 లక్షలతో రామంతాపూర్ డివిజన్‌లో, రూ.36 లక్షలతో ఆర్‌కేపురం డివిజన్‌లో చేపట్టాల్సిన రోడ్డు పనులు మొదలుకాకపోవడమే అందుకు నిదర్శనం. ఇలాగే రూ.10 లక్షల విలువైన పనుల నుంచి రూ.కోటి, రూ.2 కోట్ల విలువైన వందలాది పనులు శంకుస్థాపన వద్దే నిలిచిపోయాయి.

**ఇంజినీర్లకు హెచ్చరికలు**

జీహెచ్‌ఎంసీ ఏడాదిన్నరగా గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో పూర్తిచేసిన పనుల ఈఎండీ డబ్బులైనా ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిని సహాయ ఇంజినీర్లు ఆమోదించి, కార్యనిర్వాహక ఇంజినీర్ల అనుమతితో కేంద్ర కార్యాలయానికి పంపిస్తున్నారు. అయితే నిధులు ఖర్చయ్యే పనులను కొంతకాలం ఆపాలని కేంద్ర కార్యాలయం ఇంజినీర్లకు స్పష్టం చేసింది. కమీషన్ల కోసమే ఇంజినీర్లు పనిచేస్తున్నారనే అనుమానం, నిధుల సమస్య, ఇతరత్రా కారణాలతో పనులు చేయవద్దనడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

# ఈఎస్ఐ ఏర్పాటు ఎప్పుడో!



తాండూరు : బతుకుదెరువు కోసం వచ్చిన కార్మికులకు దశాబ్దాలు గడిచినా ఈఎస్ఐ వైద్య సేవలు అందడం లేదు. ప్రమాదాలకు గురైనా, అనారోగ్యం బారిన పడినపుడు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. చెమటోడ్చి సంపాదించిన సొమ్మును వైద్యానికి ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం ఈఎస్ఐ డిస్పెన్సరీ మంజూరు చేసి ఏళ్లు గడిచినా వినియోగంలోకి రాకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇటీవల తాండూరు పాత మున్సిపల్ భవనంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించినా అడుగు ముందుకు పడడంలేదు.

**రాత్రి పగలూ కార్యకలాపాలు:** జిల్లాలో తాండూరు ప్రాంతం వ్యాపార కేంద్రంగా పేరొందింది. మండలంలో మూడు, సరిహద్దులో రెండు సిమెంటు కర్మాగారాలు కొనసాగుతున్నాయి. ఐదు సిమెంటు కర్మాగారాల్లో రాత్రి పగలూ కార్యకలాపాలు సాగతున్నాయి. ఈక్రమంలో ప్రమాదాలు జరిగితే గాయపడిన వారికి ఈఎస్ఐ ద్వారా ఉచిత వైద్యం పొందేందుకు నెలనెలా రూ.18లక్షలు చెల్లిస్తున్నారు.. మండలంలోని మల్కాపూర్, ఓగీపూర్, సంగెంకలాన్, కరణ్‌కోట, కోటబాన్సపల్లిలో వందలసంఖ్యలో నాపరాయి గనులు కొనసాగుతున్నాయి. వీటికి అనుసంధానంగా నాపరాయి నునుపు, కోత పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో వందల సంఖ్యలో కార్మికులు పనులు చేస్తున్నారు. వీరిలో చాలామంది కార్మిక శాఖ గుర్తింపు కార్డులు పొందారు. అయినా ప్రయోజనం లేదు.

**సిబ్బంది సిద్ధం:** వేలాది మంది కార్మికుల వైద్యం దృష్ట్యా ప్రభుత్వం ఈఎస్ఐ డిస్పెన్సరీని మంజూరు చేసింది. ఇద్దరు వైద్యులు, మరో ఇద్దరు సహాయకులు, నలుగురు నర్సుల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. అనువైన భవనం కోసం అన్వేషించిన అధికారులు పట్టణంలో నిరుపయోగంగా ఉన్న పాత మున్సిపల్ భవనాన్ని పరిశీలించారు. ఇందులో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు గతేడాది నవంబరులో ఖరారు చేయగా ఎమ్మెల్యే ఆమోదం తెలిపారు. అందరూ సముఖత తెల్పడంతో సేవలు అందుబాటులోకి వస్తాయని కార్మికులు ఆశించారు. రెండు నెలలు గడిచినా ఊసెత్తడంలేదు..

**జేబులు ఖాళీ**

జిల్లాలో ఈఎస్ఐ వైద్య సేవలు అందించకపోవడంతో కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు గత్యంతరంలేక పొరుగునున్న కర్ణాటక గుల్బర్గా, పక్కనున్న సంగారెడ్డి జిల్లా, హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రులకు వెళ్తున్నారు. వందల కి.మీ. దూరంతో రవాణా ఖర్చులు భరించాల్సిన పరిస్థితి. మరికొందరు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తుండగా రూ.వేలల్లో ఆర్థికభారం పడుతోంది. నెలనెలా ఈఎస్ఐ రుసుం చెల్లించినప్పటికి ఉచిత వైద్యం దక్కకపోవడంపై పెదవివిరుస్తున్నారు.

## మసక బారిన హెచ్‌ఎండీఏ విజి'లెన్స్'

హైదరాబాద్: శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పెద్దఎత్తున అక్రమ భవంతులకు అడ్డాగా మారుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడం, నివాస, వాణిజ్య భవనాల అద్దెలు భారీగా పెరగడంతో చాలామంది ఉన్న తక్కువ స్థలంలోనే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. దీంతో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు 1000 చ.మీ. విస్తీర్ణంలో జీ+5 వరకు అనుమతులు ఇచ్చేందుకు అధికారం ఉంది. అయితే స్థానిక అధికారుల అండదండలతో కొందరు మరో 3 అంతస్తులు అదనంగా, అక్రమంగా నిర్మిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 200 చ.మీ. విస్తీర్ణంలోనూ 5 అంతస్తుల భవనాలు చేపడుతున్నారు. అందుకు ప్రతిఫలంగా స్థానిక యంత్రాంగానికి భారీగా ముడుతోంది. దీంతో ఏటా రూ.కోట్లల్లో హెచ్‌ఎండీఏ ఆదాయానికి గండిపడుతోంది. అనుమతులు ఇతరత్రా ఫీజుల ద్వారా హెచ్‌ఎండీఏకు నెలకు రూ.100 కోట్ల వరకు సమకూరుతుండగా.. అక్రమ నిర్మాణాలతో రూ.50-60 కోట్లు ఆదాయం కోల్పోతోంది.

**ఎక్కడెక్కడంటే..**శంషాబాద్, బోడుప్పల్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జవహర్‌నగర్, ప్రగతినగర్, బండ్లగూడ జాగీర్ తదితర పురపాలికల్లో భారీఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఇప్పటికే హెచ్‌ఎండీఏ




గుర్తించింది. గతంలో ఆయా ప్రాంతాల్లో 600 అక్రమ భవనాలున్నట్లు తేల్చగా వాటిలో 200 పది అంతస్తుల వరకు ఉన్నాయి. వీటిని అధికారులు పాక్షికంగా కూలగొట్టి వదిలేశారు. దీంతో వాటికి యజమానులు మరమ్మతులు చేయించి విక్రయించినట్లు తెలుస్తోంది. మరికొందరు ఇప్పటికే వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలకు ఊతమిచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

**తెలిసినా ఫిర్యాదులేవీ?**

హెచ్‌ఎండీఏలో ఓ డీసీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విజిలెన్స్ విభాగం పనిచేస్తోంది. ఓ సీఐ, ఎస్ఐ కానిస్టేబుళ్లు, హోంగార్డుల ఆధ్వర్యంలో గతంలో విజిలెన్స్ వింగ్ ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి మాదిరిగా హెచ్‌ఎండీఏ విజిలెన్స్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లేకపోవడంతో స్వయంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. అక్రమ నిర్మాణాలు గుర్తించినా వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ కొందరు అధికారులు ఈ అక్రమాల్లో భాగస్వాములు కావడంతో అక్రమ భవనాల గురించి సమాచారం అందించినా ప్రయోజనం లేదు. విజిలెన్స్ విభాగంలో కొంతకాలంగా సీఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకొని అక్రమ భవనాలపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది.

## సమాఖ్య స్ఫూర్తి.. స్వశక్తి కీర్తి

గంగాధర : స్వశక్తి ఉద్యమంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నా రు. పొదుపు మంత్రంతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తూ నిలదొక్కుకునేలా జాగ్రత్త పడుతున్నారు. నెలనెలా ఆదాయ మార్గాలు అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గంగాధర మండలంలో గతేడాది 491 సంఘాలకు రూ.57.78 కోట్ల రుణాలు బ్యాంకులు మంజూ రు చేశాయి. ఆయా సంఘాలకు 548 యూనిట్లు కేటాయించి స్వశక్తిపై ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారు. స్వశక్తిపై రాణించి కుటుంబాలకు అండగా ఉంటున్న పలువురి విజయగాథపై



స్ఫూర్తిదాయక కథనం.

**ఏడాదిన్నరగా చేతినిండా పని**

గంగాధరకు చెందిన మెరుగు గంగాభవానీ, అమిరిశెట్టి విజయ, తాళ్ల నిర్మల మండల కేంద్రంలో ఏడాదిన్నరగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రూ.1.50 లక్షలు బ్యాంకు ద్వారా రుణం పొందారు. ఆర్డరుపై పిండి వంటలు తయారు చేసి ఇతర ప్రదేశాలకు పంపిస్తున్నారు. ఖర్చులు పోగా రోజుకు రూ.1000 మిగులుతున్నాయని, సొంత పనులు చేసుకుంటున్నామని సభ్యులు తెలిపారు.

**లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్**

ర్యాలపల్లికి చెందిన బొజ్జ స్వాతి గంగాధరలో లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్ యూనిట్‌తో నెలకు రూ.30 వేలు సంపాదిస్తున్నారు. బ్యాంకు ద్వారా రెండు విడతల్లో రూ.3.05 లక్షల రుణం పొందారు. నెలకు రూ.7 వేల చొప్పున బ్యాంకుకు చెల్లిస్తూ రుణం తీరుస్తుండగా కుటుంబ ఖర్చులు పోను నెలకు రూ.15 వేలు పొదుపు చేస్తున్నారు. 1998 నుంచి సంఘంలో పొదుపు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు.

**ఇతరులకు ఉపాధినిస్తూ..**తాడిజెర్రికి చెందిన గుంటుకు అరుణ కూలీ పనులకు వెళ్లేవారు. 2016లో స్వశక్తి ఉద్యమంలో చేరాక పిల్లల చదువుకు బ్యాంకు ద్వారా రుణం పొందారు. గ్రామైక్య సంఘం ద్వారా రూ.లక్ష, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు తీసుకొని భర్త శేఖర్‌కు బైక్ మెకానిక్ షాపు ఏర్పాటు చేశారు. ఇందులో మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నారు. బ్యాటరీలు కూడా విక్రయిస్తున్నారు. నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోందని అరుణ తెలిపారు.

**కుటుంబానికి అండగా..**

ఉప్పరమల్యాలకు చెందిన శ్రీలత కుటుంబంతో వచ్చి గంగాధరలో కిరాణ దుకాణం నడిపించుకుంటున్నారు. 2020లో రూ.లక్ష రుణం తీసుకొని దుకాణం ప్రారంభించారు. బ్యాంకు రుణం తీర్చి పిండిగిర్ని, కొవ్వొత్తుల తయారీతో వ్యాపారాన్ని విస్తృతం చేశారు. రూ.2 లక్షల రుణం తీసుకొని భర్త లక్ష్మీకాంతంకు ట్రాలీ ఆటో కొనుగోలు చేసి ఇచ్చారు. ఆయిల్ డీలర్‌షిప్ తీసుకొని దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పిల్లలను చదివించుకుంటూనే స్వశక్తి ద్వారా నెలకు రూ.35 వేలు సంపాదిస్తున్నట్లు శ్రీలత ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు.

# నిఘా నేత్రం.. నిర్వహణ భారం

హైదరాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో ఎంతో కీలకమైన సీసీ కెమెరాల నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోంది. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా పోలీసులు కాలనీ సంఘాల్ని చైతన్యపరచి రాజధానిలో లక్షలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో అదే స్థాయిలో దృష్టి సారించకపోవడం సమస్యగా మారుతోంది. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదో గుర్తించి స్థానిక కాలనీ సంఘాలతో మాట్లాడి సరి చేయించాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. మరమ్మతు కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో కాలనీ సంక్షేమ సంఘాలు వెంటనే చేయించడం లేదు. ఫలితంగా నేరాలు జరిగినప్పుడు నిందితుల్ని గుర్తించడం, ఆధారాలు సేకరించడంలో పోలీసులకు ఇబ్బంది ఎదురవుతోంది.

రాజధానిలో మూడు కమిషనరేట్ల పరిధిలోని కాలనీ సంఘాలు, గేటెడ్



కమ్యూనిటీలు, సంస్థలు, వ్యాపార సముదాయాలతో పోలీసులు లక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

**ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి**

డాక్టర్ ఎం జగన్‌మోహన్‌రావు, మెడికల్ అండ్ హెల్త్ కాలనీ సంఘం జనరల్ సెక్రెటరీ, బీఎన్‌రెడ్డినగర్

రోడ్లు, వీధి దీపాల తరహాలోనే ప్రభుత్వం సీసీ కెమెరాలను నిర్వహణపై కూడా దృష్టిసారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల నేరాల తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. భద్రతాపరంగా ఎంతో కీలకమైన ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

# తియ్యగా తినేస్తోంది..!

మిర్యాలగూడ : 'దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మధుమేహ రోగుల సంఖ్యలో మూడోస్థానంలో ఉంది.. తెలంగాణలో 1.75 కోట్ల మందికి పరీక్షలు చేస్తే 24.52 లక్షల మందికి మధుమేహం నిర్ధారణ అయింది.. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక సారాంశం ఇది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేకంగా అసంక్రమిత వ్యాధుల విభాగాన్ని ఏర్పాటు చేసి 30 ఏళ్లు పైబడిన వారికి చేస్తున్న పరీక్షల్లో మధుమేహ కేసుల సంఖ్య పెరిగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. పట్టణ జనాభా పెరిగిపోవటం, ఆహారపు అలవాట్లు మారిపోవడం, శారీరక వ్యాయామం లేకపోవటం ప్రధాన కారణాలుగా గుర్తిస్తున్నారు. మూడు పదులు దాటిన వారిలో వైద్య పరీక్షలు చేస్తే మధుమేహం నిర్ధారణ అవుతుండగా వారికి ప్రభుత్వం ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నారు.

జీవన శైలి కారణంగానే..

అలుగుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి ఎండీ

మూడు పూటలా అన్నం, పిండి పదార్థాలు ఉండే అల్పాహారం, శారీరక శ్రమలేక, కూర్చుని చేసే ఉద్యోగాలు ప్రధాన కారణం. కాగా మందుల వాడకంతో పాటుగా ఆహారపు అలవాట్లలో మార్పులతో మధుమేహం నియంత్రించవచ్చు. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తగ్గించటంతో పాటు తృణధాన్యాలు అధికంగా తీసుకోవాలి. కార్యాలయాల్లో పనిచేసే వారు ఎక్కువ సమయం కూర్చొకుండా కనీసం అరగంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరగాలి. నిత్యం వ్యాయామం, వారంలో మూడు రోజులైనా నడవాలి. కనీసం ఎనిమిది గంటల అంతరాయం లేని నిద్ర అవసరం. బరువు తగ్గాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మధుమేహాన్ని పూర్తిగా నయం చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇన్సులిన్ మాత్రలు వంటి ప్రయోగాలు చేస్తున్నారు.

# ప్రతిభ చాటేలా.. ఫలితాల్లో మెరిసేలా

మునగాల : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరిసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రెండేళ్ల కిందట కేజీబీవీల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. తెలుగు నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మారిన వారికి ఇబ్బందులు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. సర్కారు బడుల్లో మాదిరిగానే నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**పఠనానికి ప్రాధాన్యం..**

కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి తరగతిలో మొదటి 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని పఠనానికి కేటాయించేలా ప్రణాళిక నిర్దేశించారు. ఇందుకు సబ్జెక్టుకు ఒక సీఆర్టీ ఇన్‌ఛార్జిని నియమించారు. నిత్యం చదవాల్సిన అంశాన్ని విద్యార్థినులకు వీరు సమాచారం అందిస్తారు. సంబంధిత అంశం పూర్తయ్యాక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆయా సబ్జెక్టుల ఇన్‌ఛార్జులు నిత్యం వాటిలోని ఉత్తమ పఠనాన్ని ఎంపిక చేస్తారు. ఫలితంగా విద్యార్థుల్లో పోటీ పెరగడంతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చుననే ధీమాతో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. ఇదే విధానాన్ని పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్నారు.

**బృందాల విభజన..**

సామర్థ్యాలు పెంపొందించడానికి విద్యార్థులను మెరిట్, మధ్యస్థం, తక్కువగా చదివేవారు.. ఇలా మూడు భాగాలుగా విభజించారు. అందరూ మొదటి స్థాయికి వచ్చేలా వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పఠనా సామర్థ్యాలతో విద్యార్థుల మధ్య పోటీతత్వం పెంపొందిస్తూ, ప్రతి అంశాన్ని సులువుగా ఎలా అర్థం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇలా రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం అమలు ద్వారా సత్ఫలితాలు సాధిస్తామని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా వెనుకబడిన విద్యార్థులకు మేలు జరుగుతుందని, అన్ని అంశాల్లో పట్టు సాధించేలా అవగాహన పెంపొందిస్తున్నామని జీసీడీవో పూలన్ తెలిపారు.

# ఆట మైదానాలకు.. టెం'డర్'!



కరీంనగర్ : కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలోని స్కేటింగ్ కోర్టు ఇది. చిన్నారులు ఇక్కడకు వచ్చి స్కేటింగ్ నేర్చుకుంటుంటారు. సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తుంటారు. ముమ్ముందు పిల్లలు ఇక్కడ స్కేటింగ్ చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఆదాయ వనరుల కోసం అధికారులు ఈ స్టేడియాన్ని ప్రైవేటు వారికి అప్పగించాలనే నిర్ణయం దీనికి బలం చేకూరుస్తుంది.

చిన్నారులు, యువత ఆరోగ్యం ఎక్కడో లేదు.. వారు ఆడుకునే మైదానంలో దాగి ఉందని' స్వామి వివేకానంద చెప్పిన మాటలు కరీంనగర్‌లో చెల్లుబాటు అయ్యేలా లేవు. యువజన క్రీడా శాఖ అధికారుల నిర్వాకంతో ఇకమీదట ఇక్కడ ఆడే కొన్ని ఆటలకు పైసలు కట్టాలి. ఆదాయమే పరమావధిగా ఇక్కడి అధికారుల నిర్ణయం క్రీడాకారులకు శాపంగా మారబోతోంది. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన స్థలాలు ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి లీజు రూపంలో వెళ్ల బోతున్నాయి. బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాస్థలాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బిడ్ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ మైదానాలను లీజుకు ఇచ్చేందుకు నిబంధనలను రూపొందించారు. స్కేటింగ్ రింగ్‌కు నెలకు రూ.50 వేల కిరాయితోపాటు రూ.1.50 లక్షల ధరావత్తు చెల్లించాలి. బ్యాడ్మింటన్ కోర్టుకు నెలకు రూ.1.50 లక్షల అద్దెతోపాటు రూ.5 లక్షలు ముందస్తుగా అందించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి, కరీంనగర్ పేరిట ప్రకటన వెలువర్చారు. క్రీడాభిమానులతోపాటు పలువురు వ్యాయమోపాధ్యాయులు ఈ నిర్ణయంపై విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**మరింత "ప్రియం..**

కరోనా తరువాత కరీంనగర్‌లో క్రీడా పోటీల నిర్వహణ అనేది గగనమవుతోంది. పైగా సాధన చేసేందుకు ఉన్న అరకొర మైదానాలు ఇలా లీజులతో దూరమవడంతో సామాన్య క్రీడాకారుడికి ఆట అంటే ఖరీదైన వ్యవహారంగానే మారే అవకాశముంది. టెండర్ ద్వారా మైదానాన్ని దక్కించుకున్న వారు అద్దె చెల్లించాలనే ఉద్దేశంతోనే ఉంటారు. ఇక్కడ ఆటలాడే వారి నుంచి ఫీజు వసూలు చేస్తారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న బ్యాడ్మింటన్ ఆడాలంటే నెలకున్న అద్దె ప్రకారం రోజుకు రూ.5 వేలు వసూలు చేయాలి. ఇంత మొత్తాన్ని చెల్లించి ఏ కోచ్ ముందుకొస్తాడు..? ఏ క్రీడాకారులు ఇక్కడ ఆటలాడుతారనేది అంతుచిక్కన్ని ప్రశ్నగానే మారింది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మైదానాలు వెళ్లడంతో పేద విద్యార్థులకు ఆట కలగానే మిగిలిపోనుంది.

**ఆదాయమే ముఖ్యమా..**

అంబేద్కర్ మైదానం నిర్వహణకు ఆదాయాన్ని సమకూర్చాలనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారనేది అర్థమవుతోంది. వాస్తవానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను పక్కాగా వినియోగించుకుంటే ఈ లీజు కథ ముందుకొచ్చేది కాదు. ఈత కొలను నిర్వహణ ద్వారా ఆదాయం సమకూరుతుంది. దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని పక్కాగా వినియోగించుకోవడంపైన దృష్టి సారించకుండా కొత్త దారులను వెతకడం హాస్యస్పదంగానే అనిపిస్తోంది. మరో వైపు గతంలో ఈత కొలను ద్వారా వచ్చే ఆదాయం పైసలు పక్కదారి పట్టిన ఉదంతాలున్నాయి. వాటిని చక్కదిద్దడం పక్కనబెట్టి కొత్తదారులను అన్వేషించడానికి కారణమేంటనేది ఎవరికీ అర్థం కావడంలేదు. పైగా ఇటీవల రూ.7 కోట్లతో నిర్మించిన ఆధునిక సముదాయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ దాదాపు 22 దుకాణ సముదాయాలతోపాటు అద్దెకు ఇచ్చే విధంగా గదులు, ఒక వేడుక ప్రాంగణం సిద్ధంగా ఉన్నాయి. ఏడాది కాలంగా ఇది ప్రారంభానికి నోచుకోలేదు. ఒకవేళ ఆదాయంపైనా దృష్టి ఉంటే ఈ అధికారులు ఈ సముదాయ భవనాన్ని త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటే బాగుండేదనే భావన క్రీడాభిమానులు, ప్రజల నుంచి వినిపిస్తోంది.

**అధికారులేమన్నారంటే..!** టెండర్ పిలిచిన మాట వాస్తవమేనని.. ఆదాయం రావడంతోపాటు ఆటలకు ప్రాధాన్యముంటుందని జిల్లా కలెక్టరు పమేలా సత్పతి అన్నారు. కొన్నాళ్లుగా వృథాగా ఉండటంతో అధికారులంతా సమష్టిగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని.. దీని ద్వారా క్రీడల అభివృద్ధికి సహకారం అందుతుందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ.. నిర్వహణ నిధులు సమకూర్చేందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నా మని.. తాము ఏది చేసినా జిల్లా కలెక్టరు ఆదేశాలతో చేస్తున్నామని చెప్పారు.

# పేదలకు సొంతింటి యోగం!



పరిగి : పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు నెలల కిందటే గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. తాజాగా మరో అడుగు ముందుకు వేసి, ప్రత్యేక యాప్ రూపొందించడంతో వివరాల సేకరణ ప్రారంభమైంది. గృహ నిర్మాణశాఖలో విధులు నిర్వహించి, ఇతర శాఖల్లోకి బదిలీ అయిన వారిని మళ్లీ అదే శాఖకు పంపుతున్నారు.

**2.57లక్షల దరఖాస్తులు**

ప్రజాపాలనలో భాగంగా గత డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించారు. పది అంశాలకు కలిపి మొత్తంగా 13,24,270 అర్జీలు అందాయి. వాటిలో ప్రధానంగా గృహాలు మంజూరు చేయాలని కోరుతూ 2,57,664 వచ్చాయి. వీటినే ప్రామాణికంగా తీసుకున్న అధికారులు సర్వే బాట పట్టారు. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులతో పాటు ఇతర సిబ్బంది కూడా దరఖాస్తుల పరిశీలన విధుల్లో పాల్గొంటున్నారు.

**తొలి విడతలో 3,500..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 చొప్పున ఇవ్వాలని యోచిస్తున్నట్లు ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలుండగా 14 వేల ఇళ్లను చేపట్టనున్నారు.

**వీరికే ప్రాధాన్యం..**

ఇళ్ల మంజూరు విషయంలో ఒంటరి మహిళలతో పాటు ఆహారభద్రత కార్డు కలిగిన వారు, దివ్యాంగులు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేవారిని ఎంపిక చేయనున్నారు. ఆ తరువాత ఇతరులకు అవకాశం దక్కనుంది.

**గృహనిర్మాణ శాఖ బలోపేతం..** ఇందిరమ్మ ఇళ్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని భావించిన కేసీఆర్ సర్కారు చివరకు ఆ శాఖనే రద్దు చేసి అందులో పనిచేస్తున్న అధికారులను ఇతర శాఖల్లోకి పంపారు. అంతేగాకుండా ఇళ్ల మంజూరు కూడా చేపట్టకపోవడంతో పేదలు నిరాశకు లోనయ్యారు. మళ్లీ రేవంత్ ప్రభుత్వం తిరిగి తీసుకోనుండడంతో గృహ నిర్మాణ శాఖ పునరుత్తేజం కానుంది. ఒక్కో ఇంటి నిర్మాణ పనులకు నాలుగు విడతల్లో రూ.5లక్షల నగదు సాయం అందించనుంది. **నెలాఖరు వరకు పరిశీలన పూర్తి..** జిల్లాలోని 566 పంచాయతీల్లో సర్వే జరుగుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా, యాప్‌లో నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం విడతల వారీగా జిల్లాకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్.

# అదనం లేకపోయినా జాప్యమే

హైదరాబాద్: అనుమతులకు అదనంగా అంతస్తులను నిర్మించాలనుకున్నా.. నిధులు లేక, సాంకేతిక అనుమతులు రాకపోవడంతో తొలిదశలోని ఉత్తర్వులనే ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడానికి నిర్ణయం తీసుకొంది. దీంతో సనత్‌నగర్, చైతన్యపురిలోని భవనాల అంతస్తులు కుదించక తప్పడం లేదు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అంతస్తుల సంఖ్య తగ్గింది. నాలుగింటిలో రెండు ఆస్పత్రుల అంతస్తులను ప్రభుత్వం తగ్గించింది. మిగిలిన రెండు యథావిధిగా నిర్మిస్తోంది.

**ఇక్కడ నిర్మాణం:** సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, చైతన్యపురిలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నిమ్స్ విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మూడు నూతన ఆస్పత్రుల నిర్మాణానికి రూ.2,697 కోట్లు, నిమ్స్ విస్తరణకు రూ.1,698 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

**ఇదీ లక్ష్యం:** వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సనత్‌నగర్, అల్వాల్, చైతన్యపురి ఆస్పత్రుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అనుమతులతోపాటు వివిధ కారణాలతో సుమారు ఆరు నుంచి ఏడు నెలలు జాప్యమవుతోంది.

చైతన్యపురిలో నిర్మిస్తున్న గ్రౌండ్(జి)ం13 అంతస్తులకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత జిం13 అంతస్తులకే అనుమతి లభించింది. ఆ తర్వాత 24 అంతస్తులకు పెంచాలని నిర్ణయించింది. నిధుల సమస్యతో తాజాగా మళ్లీ జిం13 అంతస్తులకే పరిమితం చేయాలనుకుంటున్నారు.



సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జిం5 అంతస్తులకు పరిమితం చేశారు. గతంలో జిం6గా నిర్మించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతం బేగంపేట విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో ఎయిర్ పోర్ట్ అథారిటీ అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. భారీగా చేపట్టిన నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. మిగిలిన మూడింటితో పోలిస్తే నిమ్స్ నిర్మాణాలు 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలిచ్చారు.

# ఆలయాల సమాచారం.. అంతర్జాలంలో నిక్షిప్తం

కరీంనగర్ : దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల పూర్తి సమాచారం అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలయాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుళ్లను సులభంగా గుర్తించేలా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా చేస్తున్నారు. ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ఆధునిక సాంకేతికను వినియోగించుకుంటున్నారు. అన్ని రకాల దేవాలయాల సమాచారాన్ని జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)తో అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ విధానంతో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడనుంది.

**అన్నింటికి జియో ట్యాగింగ్**

దేవాలయం ఎక్కడ ఉంది? దాని సరిహద్దులు ఏమిటి? దాని పరిధిలోని భూములు ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఇలా ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం ప్రజలకు తెలిసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారం పొందుపరుస్తున్నారు.

దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్, రిజిస్టర్ అయి ఉన్న దేవాలయాలు, ధూపదీప నివేదన పథకంతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధించిన సమాచారం



కావాలనుకుంటే టైప్ చేస్తే చాలు.. పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. భూములు, ఆస్తుల వివరాలను సైతం ఫొటోల ద్వారా సేకరించి ప్రభుత్వ ధరణి వెబ్‌సైట్ నుంచి జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. జియో ట్యాగింగ్‌లో జీపీఎస్ ద్వారా ఫిక్స్ చేస్తున్నారు. భవిష్యత్తులో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు దేవాదాయ శాఖ కసరత్తు చేస్తోంది.

ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లోకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయాలకు సంబంధించిన కోఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

**అన్యాక్రాంతం కాకుండా..**

ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో ఏదైన ఆలయ భూమి కబ్జాకు గురైతే తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్‌లో సర్చ్ చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాంశాలతో మనకు ఆ ప్రదేశం చూపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని దేవాలయాల సమాచారం పక్కగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దేవాలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఇది దోహదపడుతుంది. – సుప్రియ, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

# ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

కొడిమ్యాల: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో తమ గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం తారు రోడ్లు, బస్సు షెల్టర్లు నిర్మిస్తున్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కొడిమ్యాల మండలం నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లి, నల్లగొండ వరకు తారురోడ్డు ఉన్నప్పటికీ చాలా ఏళ్లుగా బస్సు సదుపాయం లేకపోవడంతో ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. బస్సు సదుపాయం కల్పిస్తే కరీంనగర్, జగిత్యాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. గతంలో జగిత్యాల నుంచి మల్యాల, బల్వంతాపూర్, సర్వాపూర్, నర్సింహులపల్లె, గౌరాపూర్ మీదుగా పూడూర్ వరకు బస్సు సదుపాయం ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో ఆ గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దమ్మయ్యపేట, బోల్లోనిచెరువు, చింతలపల్లి గ్రామాలకు నేటికీ బస్సు



సౌకర్యంలేదు. జగిత్యాల నుంచి కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల నల్లగొండ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సదుపాయం ఉండగా కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు.

**పునరుద్ధరించాలి..**

గతంలో జగిత్యాల నుంచి వయా కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల, వేములవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు పల్లెవెలుగు బస్సు సదుపాయం ఉండేది. దీంతో గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలకు సౌకర్యంగా ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో గ్రామస్థులు ఎటువెళ్లాలన్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సును పునరుద్ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– దయ్యాల రవి, రామకిష్టాపూర్

**ప్రైవేటు వాహనాలే దిక్కు..**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లె గ్రామాలకు తారురోడ్డు ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామస్థులు ఏళ్లుగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సదుపాయం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇరుమల్ల రమేష్, నమిలికొండ



# జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో రేవంత్, చంద్రబాబు భేటీ

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల సీఎంలు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో కలుసుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాసేపు ముచ్చటించుకున్నారు.

రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ముఖ్యమంత్రుల మధ్య చర్చ జరిగింది. రేవంత్‌రెడ్డి వెంట తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. మరోవైపు జ్యూరిచ్ చేరుకున్న సీఎం చంద్రబాబు బృందానికి ఎయిర్‌పోర్టులో యూరప్ తెదేపా ఫోరం సభ్యులు, ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారులు ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్‌తో ఎన్ఆర్ఐ తెదేపా నేతలు ఫొటోలు దిగారు.

# ఏపీలో స్కిల్, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు



అమరావతి: ఏపీలో స్కిల్, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. జ్యూరిచ్‌లో గల హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ బృందం ఇవాళ(సోమవారం) భేటీ అయింది. స్విట్జర్లాండ్‌లో ఫార్మా పరిశ్రమ వంద బిలియన్ డాలర్లకు పైగా విలువ కలిగి ఉందని అన్నారు. ఏపీ ఫార్మా రంగంలో పెట్టుబడులకు సహకరించాలని రాయబారి మృదుల్ కుమార్‌ను చంద్రబాబు బృందం కోరారు. నోవార్టిస్, ఆల్కాన్ సహా దిగ్గజ ఔషధ కంపెనీల యూనిట్లు ఏపీలో ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని లోకేష్ కోరారు. ఏపీలో విదేశీ పెట్టుబడులకు పూర్తి అనుకూలమని మంత్రి లోకేష్ అన్నారు. ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో నూతన పాలసీలు ప్రకటించామని గుర్తుచేశారు. మ్యానుఫ్యాక్చరింగ్, టెక్స్ టైల్స్, మిషనరీ, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా స్యూటికల్స్, వైద్య పరికరాల తయారీ పరిశ్రమల్లో విదేశీ పెట్టుబడులకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు అందజేస్తామని లోకేష్ తెలిపారు. ఏపీలో స్కిల్, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని లోకేష్ చెప్పారు. ఏపీ–స్విస్ వర్సిటీల పరస్పర సహకారం కోరుతున్నామని లోకేష్ తెలిపారు. భారత్‌లో 350కు పైగా స్విస్ కంపెనీలు ఉన్నాయని మృదుల్ కుమార్ అన్నారు. భారత్‌లో స్విస్ కంపెనీల ద్వారా 1.3 లక్షల ఉద్యోగాలు వచ్చాయని.. భారత్‌కు చెందిన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, మహీంద్రా వంటి సంస్థలు స్విస్‌లోనూ తమ యూనిట్లు ఏర్పాటు చేశాయని మృదుల్ కుమార్ తెలిపారు. ఏపీలో మ్యానుఫ్యాక్చరింగ్, R&D, మెకానికల్ సహా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని లోకేష్ కోరారు. ఏపీలో ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల వాతావరణం ఉందని లోకేష్ చెప్పుకొచ్చారు. ఏపీలో ఇన్వెస్టర్స్‌తో కలిసి ఫ్రెండ్లీ విధానాలతో నూతన పాలసీలు తీసుకువచ్చామని అన్నారు. టెక్స్ టైల్స్, మిషనరీ, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్.. ఫార్మా స్యూటికల్స్, వైద్య పరికరాల తయారీ పరిశ్రమల్లో..విదేశీ పెట్టుబడులకు ఆకర్షణీయ ప్రోత్సాహకాలు అందజేస్తామని లోకేష్ తెలిపారు. ఏపీ–స్విస్ వర్సిటీల పరస్పర సహకారం కోరుతున్నామని లోకేష్ అన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివి ధంగా ఏపీలో పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించామని చెప్పారు. అనుమతులన్నీ 15 రోజుల్లో ఇచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఏపీలో తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, ఎయిర్ కనెక్టివిటీ ఉందని స్పష్టం చేశారు. ఏపీలో విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులు ఉన్నాయని లోకేష్ చెప్పుకొచ్చారు. త్వరలో భోగాపురం, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు అందుబాటులోకి వస్తాయని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# విశాఖలో హోంమంత్రి పర్యటన.. పీఎస్‌లో ఆకస్మిక తనిఖీలు



విశాఖపట్నం, జనవరి 20: హోంమంత్రి వంగలపూడి అనిత విశాఖలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు హోంమంత్రి. పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించిన అనిత.. రౌడీ షీటర్ల వివరాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని పోలీసులకు సూచించారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ఆదేశించారు. ఛార్జ్‌షీటు విషయంలో ఆలస్యం చేయవద్దని.. ట్రాఫిక్, పార్కింగ్‌పై దృష్టి సారించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల కష్టం వినాలన్నారు. ఫిర్యాదుదారులకు ఇబ్బంది లేకుండా త్వరగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలతో మాత్రం దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. వేపగుంట నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు హోంమంత్రి. సింహాచలం ఆలయంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే మహిళా కానిస్టేబుల్స్‌తో మాట్లాడి.. వారి యోగక్షేమాలను హోంమంత్రి అనిత అడిగి తెలుసుకున్నారు.

**అప్పన్న సన్నిధిలో...** కాగా.. ఈరోజు ఉదయం విశాఖ సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో హోంమంత్రికి అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం స్వామివారి దర్శనం అనంతరం అనితకు పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వగా.. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు అప్పన్నస్వామి వారి అనుగ్రహం ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. విశాఖ స్టీల్ ఫ్లాంట్‌కు రూ.11,400 కోట్లు నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వంలో స్టీల్ ఫ్లాంట్ పరిస్థితి అయోమయంగా ఉండేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం బాధ్యతయుతంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఏపీ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేశారని అన్నారు. గత ప్రభుత్వంలో విజయసాయిరెడ్డి స్టీల్ ఫ్లాంట్ పేరుతో పాదయాత్ర చేశారని.. వైసీపీ పాలనలో ఫ్లాంట్ కోసం ఆఖరి రోజు కూడా రాజీనామాలు చేశారని విమర్శించారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన వేరు.. జగన్ ఢిల్లీ పర్యటన వేరన్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్ళిన ప్రతీసారి కేంద్రం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే పరిశ్రమలు వస్తున్నాయన్నారు. గతంలో దావోస్ పర్యటన అంటే మంత్రులు చలి అనేవారని.. ఇప్పుడు దావోస్ పర్యటనతో పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. దిశ చట్టం పేరుతో బూచి చూపించారని.. ఇప్పుడు పోలీసులు కేసులు త్వరగా పరిష్కరిస్తున్నారన్నారు. ఖైదీలకు కూడా శిక్షలు త్వరగా పడుతున్నాయన్నారు. ప్రస్తుతం పోలీసులు వినూత్నంగా ఆలోచన చేస్తున్నారని.. ప్రజల దగ్గరికే పోలీసులు వెళ్ళి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# సుప్రీంలో జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వాయిదా



న్యూఢిల్లీ, జనవరి 20: అక్రమాస్తుల కేసులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్పీ అధినేత వైఎస్ జగన్ బెయిల్ రద్దు కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ దాఖలు చేసిన పిటీషన్‌పై ఈరోజు (సోమవారం) విచారణకు వచ్చింది. అయితే సీబీఐ తరపు సీనియర్ న్యాయవాది అందుబాటులో లేనందున విచారణ వాయిదాకు సీబీఐ తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దీంతో తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వచ్చే సోమవారం (జనవరి 27)కు వాయిదా వేసింది. కాగా.. జగన్ బెయిల్ రద్దు, కేసుల బదిలీకి సంబంధించి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసులను విచారిస్తున్న ధర్మాసనంలో మార్పు జరిగింది. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం నుంచి జస్టిస్ వీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మసనానికి సుప్రీం కోర్టు రిజిస్ట్రీ మార్చింది. గత పన్నెండు సంవత్సరాలుగా ట్రయల్ ఒక్క అడుగుకూడా ముందుకు కదలలేదంటూ జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ముందు రఘురామ తరపు న్యాయవాది శ్రీనివాసన్ వాదించారు. గత పదేళ్లుగా ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోస్ చేయలేదని, ఈ వ్యవహారంలో సీబీఐ, నిందితులు ఇద్దరూ కూడా కుమ్మక్కై ఒక్క అడుగు కూడా కదలనీయడం లేదంటూ రఘురామ తరుపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరోపక్క డిశ్చార్జ్ పిటిషన్‌లపై వాదనలు విని వాటిపై ఎలాంటి నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు జడ్జీలు బదిలీ అయ్యారని.. ప్రతీ సారి ఇలా జరుగుతున్నందున ఇందులో కుట్రకోణం దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని, ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్‌పై తుది నిర్ణయం వెలువడకుండా బదిలీ అవడంతో కుట్రకోణం దాగి ఉందని అనడంలో సందేహం లేదని రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆ ఉద్దేశంతోనే ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతున్నట్లు పిటిషన్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు. అయితే బదిలీ సాధ్యం కాదని గత విచారణలో సుప్రీం కోర్టు తేల్చిచెప్పినందున కేసు విచారణ పూర్తి స్థాయిలో జరగాలని కోరుకుంటున్నట్లు న్యాయవాది శ్రీనివాసన్ చెప్పారు.

సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని కూడా సీబీఐ తరపున న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని, ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని.. సుప్రీం కోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ట్రయల్‌లో జాప్యం జరుగుతూనే ఉందని.. కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు. సీబీఐ తరపు సీనియర్ న్యాయవాది మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున ఈ కేసుకు సంబంధించి వచ్చే వారానికి వాయిదా వేయాలని సీబీఐ తరపు న్యాయవాది కోరడంతో కేసు విచారణను వచ్చే సోమవారం చేపడతామని జస్టిస్ వీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం తేల్చింది. వచ్చే సోమవారం ఈ పిటిషన్‌పై తుది విచారణ జరిగే అవకాశం ఉంది.



# సైఫ్‌పై దాడి
## నిందితుడిని పట్టించిన యూపీఐ పేమెంట్..!

ముంబయి: బాలీవుడ్ సెలబ్రిటీ సైఫ్ అలీఖాన్‌పై దాడి అంతటా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడు పోలీసుల కస్టడీలో ఉన్నాడు. ఇదిలాఉండగా, నిందితుడిని పట్టుకోవడంలో యూపీఐ పేమెంట్ కీలకంగా మారినట్లు తెలుస్తోంది. దొంగతనం చేయాలనే ఉద్దేశంతో మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ సైఫ్ ఇంట్లోకి వెళ్లాడని, అయితే అది సెలబ్రిటీ నివాసం అనే విషయం అతడికి తెలియదని నిన్న ప్రెస్‌మీట్‌లో డీసీపీ వెల్లడించారు. దాడి తర్వాత సోషల్‌మీడియాలో వచ్చిన వార్తలు చూసి అతడు విషయాన్ని తెలుసుకున్నాడని.. బాంద్రా పట్వర్ధన్ గార్డెన్‌లోని బస్టాప్‌లో ఉదయం 7 గంటల వరకూ నిద్రపోయాడని జాతీయ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. అనంతరం అతడు లోకల్ ట్రైన్‌లో సెంట్రల్ ముంబయిలోని వర్లికి ప్రయాణించాడని అధికారులు చెప్పినట్లు సమాచారం.

**300 మంది పోలీసులు..!..** నిందితుడిని పట్టుకునేందుకు సుమారు 300 మంది పోలీసులు శ్రమించినట్లు తెలుస్తోంది. ఈ గాలింపులో దాదాపు 600 సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. దాడి తర్వాత అంధేరి ప్రాంతంలో అతడు ద్విచక్ర వాహనంపై ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించి.. రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా అడ్రస్ కనిపెట్టి అక్కడ దర్యాప్తు చేశారు. అతడితోపాటు ఒకే గదిలో ఉంటోన్న మరో నలుగురు వ్యక్తుల నుంచి తగిన సమాచారాన్ని తెలుసుకున్నట్లు తెలుస్తోంది.

**యూపీఐ పేమెంట్..!..** పోలీసుల విచారణలో మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ గురించి ఒక వ్యక్తి కీలక విషయాన్ని బయటపెట్టాడు. మహ్మద్ తన వద్ద పరోటా, వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడని.. యూపీఐ పేమెంట్ చేశాడని చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. దీనిద్వారా నిందితుడి నంబర్ తెలుసుకున్న పోలీసులు లొకేషన్ ట్రేస్ చేశారని.. ఆవిధంగా అతడు థానేలో ఉన్నట్లు గుర్తించారని సమాచారం. పోలీసులను చూసి అతడు అక్కడినుంచి పారిపోవాలని చూడగా.. ఒక్కసారిగా చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.

**సీన్ రీ క్రియేట్..!...** దాదాపు 72 గంటలపాటు శ్రమించి పోలీసులు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను పట్టుకున్నారు. ప్రస్తుతం అతడు పోలీసుల కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. విచారణలో భాగంగా ముంబయి పోలీసులు నేడు అతడితో క్రైమ్ సీన్ రీక్రియేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఐదు రోజుల్లోగా నివేదికను అందించాలని బాంద్రా కోర్టు పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే.

# 'నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం' అంశం.. తెదేపా అధిష్ఠానం కీలక ఆదేశాలు

అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తోన్న నేపథ్యంలో తెదేపా అధిష్ఠానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది. ఇటీవల సీఎం చంద్రబాబు మైదుకూరు పర్యటనలో ఉన్నప్పుడు కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నారా లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆ తర్వాత పలువురు నేతలు ఇదే అంశంపై బహిరంగంగా మాట్లాడారు. పార్టీతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలను వారు చెబుతున్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూడా నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎంను చేయాలని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారు చెప్పడం సరికాదని పార్టీ అధిష్ఠానం భావించింది. ఇలాంటి సున్నితమైన అంశాలపై కూటమి నేతలు చర్చించి నిర్ణయం తీసుకుంటారని స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

# డిప్యూటీ సీఎం పవన్ భద్రతపై డీజీపీ కీలక వ్యాఖ్యలు



రాజమండ్రి, జనవరి 20: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భద్రతపై ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పవన్ భద్రతపై ప్రతీ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నామన్నారు. ఉపముఖ్యమంత్రి ఇంటిపై డ్రోన్ ఎగురవేయడంపై విచారణ చేస్తామని.. పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా? లేదా? అన్నది నిర్ధారిస్తామని చెప్పారు. ఇక పవన్ కళ్యాణ్ ఏజెన్సీ పర్యటనలో భద్రతాపరంగా ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ పర్యటన తర్వాత వచ్చిన వ్యక్తి ఎవరనే విషయంపైనా విచారణ జరుగుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. ఈరోజు (సోమవారం) ఉదయం రాజమండ్రిలో డీజీపీ పర్యటించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన డీజీపీ.. పవన్ భద్రత అంశాన్ని సీరియస్‌గా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగిరిన ఘటనపై పోలీస్ శాఖ సీరియస్‌గా దర్యాప్తు చేస్తోందని.. నిన్న సాయంత్రానికి విచారణ పూర్తి కావాల్సి ఉందన్నారు. డ్రోన్ ఎగరడంపై పోలీసులు ముఖ్యమైన సమాచారాన్ని సేకరించారని తెలిపారు. అయితే ఈరోజు కూడా విచారణ కోసం కొంత సమయం కావాలని పోలీసులు అడిగారని.. నేటి సాయంత్రానికి డ్రోన్ కెమెరా ఎగిరిన అంశానికి సంబంధించి మొత్తం విచారణ పూర్తి అవుతుందని డీజీపీ తెలిపారు. గతంలో డిప్యూటీ సీఎం పవన్.. పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించిన సమయంలో ఒక నకిలీ పోలీసు ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై మీడియా ప్రస్తావించగా.. ఈ రెండు అంశాలను వేరువేరుగా చూస్తున్నామని తెలిపారు. మన్యం జిల్లాలో పవన్ పర్యటనలో ఎటువంటి భద్రతా లోపం లేదని, కేవలం పర్యటన పూర్తి అయిన తర్వాతే నకిలీ పోలీసు వచ్చినట్లు పోలీసులు గుర్తించారని.. దానిపై కూడా విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరాను ఎవరు ఎగురవేశారు.. అసలు అది డ్రోన్ కెమెరానా కాదా అనేదానిపై ప్రాథమికంగా నిర్ధారణకు వస్తామని తెలిపారు. అసలు పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగురవేసే అవకాశం ఉందా? లేదా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు పేర్కొన్నారు.



# అయితే పవన్ కళ్యాణ్ సీఎం..
## కిరణ్ రాయల్ సంచలన వ్యాఖ్యలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రి చేయాలంటూ పలువురు టీడీపీ నేతలు వ్యాఖ్యలు చేయడంపై తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ స్పందించారు. జనసేన నేతల దృష్టిలో మెగా బ్రదర్స్ అంటే ముగ్గురు కాదని, సీఎం చంద్రబాబుతో కలిపి నలుగురని ఆయన చెప్పారు. మంత్రి లోకేశ్ ను డిప్యూటీ సీఎం పదవిలో చూడాలని టీడీపీ కేడర్ కోరుకోవడంలో తప్పు లేదని కిరణ్ రాయల్ అభిప్రాయపడ్డారు. అయితే తాము కూడా పవన్ కల్యాణ్ (%ఖుఖ్ఝుఅ ఖుశ్రీఝుఅ%)ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడాలని పదేళ్లుగా ఎదురుచూస్తున్నట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ సీఎం అవ్వాలని, ఆయన్ని ఆ పదవిలో చూడాలని బడుగు బలహీన వర్గాలన్నీ కోరుకుంటున్నాయని కిరణ్ రాయల్ చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూటమి అధినేతలు ఎలాంటి ఒప్పందంతో ముందుకు వెళ్లారో అదే కొనసాగిస్తే మంచిదని జనసేన నేత కిరణ్ రాయల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అనవసరంగా వ్యాఖ్యలు చేస్తూ వైసీపీ నేతల మాటలకు ఊపిరి పోయవద్దంటూ టీడీపీ నేతలకు ఆయన హితవుపలికారు. పేర్ని నాని, రోజా వంటి పలువురు వైసీపీ నేతలు జేబుల్లో మైకులు పెట్టుకుని తిరుగుతున్నారని, వారికి అవకాశం ఇవ్వొద్దని పేర్కొన్నారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంపై రెండ్రోజులుగా డ్రోన్ కెమెరాలు తిరుగుతున్నాయని, దీనిపై ఐదుగురు అధికారులతో పర్యవేక్షణ కమిటీ వేశారని ఆయన చెప్పారు. పవన్ కల్యాణ్ దేశానికి కావాల్సిన నాయకుడని, అందుకే భద్రత పెంచాలని జనసేన నేత కిరణ్ రాయల్ కోరారు. కాగా, మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా చూడాలంటూ రెండ్రోజులుగా టీడీపీ నేతలు బహిరంగంగానే చెప్తున్నారు. ఈ జాబితాలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామరాజు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ వర్మ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఉన్నారు. దీనిపై ఇప్పుడు కూటమి అగ్రనేతలు ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ కార్యకర్తల్లో నెలకొంది.

# 'ఉయ్ అమ్మా' అంటూ మిల్కీని ఆడుకున్నారు

అందాల కథానాయిక రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ వెండితెరకు పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. రాషా నటించిన డెబ్యూ చిత్రం అజాద్ దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదే చిత్రంతో అజయ్ దేవగన్ మేనల్లుడు అమన్ దేవగన్ కథానాయకుడిగా పరిచయమవుతున్నాడు. దీంతో ఇద్దరు డెబ్యూలపైనా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే అజాద్ ప్రివ్యూ నుంచి సమీక్షలు అంతర్జాలంలోకి వచ్చేసాయి. అయితే రాషా తడానీపైనే కళ్లన్నీ. ఈ చిత్రంలో కథానాయికగా నటించిన రాషా తడానీ ఉయ్ అమ్మా .. అంటూ సాగు స్పెషల్ పాటలోను అదరగొట్టింది. ఇంతకుముందు ఈ పాట యూట్యూబ్ లో విడుదల కాగా, ముఖ్యంగా రాషా అందచందాలు డ్యాన్సులు మతులు చెడగొట్టాయి. డెబ్యూ నటి అదిరిపోయే ఎక్స్ ప్రెషన్స్ కుర్రకారు గుండెల్లో గిలిగింతలు పెట్టాయి. ఈ ప్రత్యేక గీతం రాషా ఎనర్జీని బయటికి తెచ్చింది. ఇప్పుడు ఉయ్ అమ్మా అని ప్రింట్ వేసిన టీషర్ట్ ధరించి ప్రీమియర్ కి హాజరైంది మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా భాటియా. అసలే ముంబై ఫోటోగ్రాఫర్లు అల్లరి గడుగ్గాయిలు కావడంతో తమన్నా ధరించిన టీషర్ట్ ని చూడగానే.. ఉయ్ అమ్మావ్! అంటూ ఆడుకోవడం మొదలెట్టారు. ఓవైపు ఫోటోషూట్ చేస్తూనే ఉయ్ అమ్మా అంటూ ఆటపట్టించిన ఫోటోగ్రాఫర్లను చూస్తూ తమన్నా అంతే ఫ్రెండ్లీగా నవ్వేస్తూ కనిపించింది. నిజానికి తమన్నా ముంబై ఫోటోగ్రాఫర్లతో ఎంతో సన్నిహితంగా మెలుగుతారు. వారిని తన స్నేహితులుగానే భావించి ఫోటోషూట్ కి సహకరిస్తుంటారు. అందువల్ల ఫోటోగ్రాఫర్లలో కూడా




ఉత్సాహం అంతకంతకు రెట్టింపైంది. మొత్తానికి నటవారసురాలు రాషా తడానీకి బెస్ట్ విషెస్ చెప్పేందుకు విచ్చేసిన మిల్కీ బ్యూటీకి ఫోటోగ్రాఫర్ల నుంచి గ్రాండ్ వెల్ కం లభించింది. ఉయ్ అమ్మా పేరుతో అజాద్ కి, రాషా కు కూడా ప్రచారం బాగానే కలిసొచ్చింది. ఆజాద్ ప్రత్యేక ప్రదర్శనలో పరిశ్రమ నుంచి ప్రముఖ స్టార్లు ఈవెంట్‌కు హాజరయ్యారు. అయితే బాలీవుడ్ ఫేవరెట్ జంట తమన్నా భాటియా, విజయ్ వర్మ తమ స్టైలిష్ లుక్ తో ప్రివ్యూలో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ జంట స్క్రీనింగ్ సమయంలో ప్రేమలో మునిగి తేలుతూ కనిపించారు. ప్రివ్యూ షో వద్ద రాషా తడానీతో పాటు తమన్నా కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. సెలబ్రిటీ షోలో తమన్నా భాటియా క్యాజువల్ లుక్ అందరి దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించింది.

బాడీ ఫిట్టెడ్ వైట్ రౌండ్ నెక్ టీ-షర్ట్ ధరించిన తమన్నా టీషర్ట్ ముందు భాగంలో ఉయ్ అమ్మా అని ప్రింట్ చేసి కనిపించడంతో అది ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. అలాగే డార్క్ డెనిమ్ జీన్స్ ధరించి తమన్నా చాలా కూల్‌గా కనిపించింది.

ఇక తమన్నాతో పాటు విజయ్ వర్మ కూడా స్టైలిష్ లెదర్ జాకెట్ సింపుల్ లుక్ లో కనిపించాడు. స్క్రీనింగ్ సమయంలో ఈ జంట సాన్నిహిత్యం అందరి దృష్టినీ ఆకర్షించింది.

# కురచ దుస్తులకు సాయిపల్లవి అందుకే నో చెబుతుంది!

సాయి పల్లవి క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తాను ఎంపిక చేసుకున్న పాత్రలే అంతటి గుర్తింపును..అభిమా నాన్ని తీసుకొచ్చాయి. హీరోయిన్ గా ఏ భామకు లేనంత క్రేజ్ సాయిపల్లవికి ఉంది. నేడు బాక్సాఫీస్ క్వీన్ గా తెలు గింట నీరాజనాలు అందుకుంటుంది. బాలీవుడ్ లో ప్రతిష్టాత్మక 'రామాయణం' చిత్రంలోనూ నటించే అరుదైన అవకాశం కేవలం సాయి పల్లవికి మాత్రమే వరించింది. ఎంతో మంది హీరోయిన్లు ఉన్నా? సీతమ్మ పాత్ర పల్లవిని వెతుక్కుం టూ మరీ వచ్చింది. ఆ పాత్రకు అన్ని రకాలుగా సాయి పల్లవి అర్హురాలు. గ్లామర్ పాత్రలకు పల్లవి ఎప్పుడూ దూరంగా ఉంటుంది. బోల్డ్ రోల్స్ అనేవి అమ్మడికి తెలియనే తెలియవు. ఇలా కొన్ని విలువలతో సినిమాలు చేస్తుంది కాబట్టే సాయిపల్లవి అంటే



ప్రత్యేకమైన అభిమానం కనిపిస్తుంది. మరి అసలు సాయి పల్లవి కురచ దుస్తులు ఎందుకు వేసుకుని నటించదు? అన్న సంగతి మాత్రం ఇంత వరకూ ఎక్కడా రివీల్ చేయలేదు. తొలిసారి ఓ ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని అమ్మడు లీక్ చేసింది. తాను నటే అయినా పొట్టి బట్టలు వేసుకోవడానికి ఎంత మాత్రం ఇష్టపడనంది. ఆ దుస్తులు వేసుకుని నటిస్తు న్నప్పుడు ఎదుట వారు విమర్శించడం, అభ్యంతరాలు చెప్పడం అన్నది ఎంత మాత్రం నచ్చదంది. ఆ విమర్శలు ఎదుర్కోవడం కంటే అలాంటి దుస్తులు వేసుకోకపోవడమే మంచిదని పూర్తిగా దూరంగా ఉందంది. దీనికి మరో కారణం కూడా చెప్పుకొచ్చింది. జార్జియాలో చదువు కుంటున్నప్పుడు టాంగో డాన్స్ నేర్చుకుందిట. ఆడాన్స్ కోసం ఓ వైపు కట్ చేసిన పొట్టి డ్రెస్ ధరించిందిట. అది జరిగి చాలా కాలమవుతున్నా 'ప్రేమమ్' రిలీజ్ అనంతరం ఆ వీడియో ఎవరో లీక్ చేసి వైరల్ చేసారుట. దీంతో చాలా మంది తనని తీవ్రంగా విమర్శించారుట. దీంతో చాలా బాధ పడిందిట. అప్పుడే తనకంటూ కొన్ని నియమాలు విధించుకుని ముందుకెళ్తున్నట్లు తెలిపింది. నటిగా ఎంట్రీ ఇచ్చిన నాటి నుంచి అలాంటి దుస్తుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పుకొచ్చింది.




# హృతిక్ ఫ్యామిలీ డాక్యుమెంటరీ 'ది రోషన్స్' ఆకట్టుకుందా..?



ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ ఇటీవల కాలంలో పలువురు సినీ ప్రముఖుల జీవితాలను డాక్యుమెంటరీల రూపంలో ప్రేక్షకులకు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే స్ట్రీమింగ్ కు వచ్చేసిన దర్శక ధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి, స్టార్ హీరోయిన్ నయనతార డాక్యుమెంటరీలకు మంచి ఆదరణ లభించింది. ఈ క్రమంలో తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ఫ్యామిలీ ఆధారంగా తెరకెక్కిన 'ది రోషన్స్' డాక్యుమెంటరీ రిలీజ్ అయింది. హిందీ చలనచిత్ర పరిశ్రమలో రోషన్ కుటుంబానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ ఫ్యామిలీ లెగసీ, మూడుతరాల ప్రముఖుల గురించి 'ది రోషన్స్' డాక్యుమెంటరీలో వివరించారు. హృతిక్ రోషన్, ఆయన తండ్రి రాకేశ్ రోషన్, తాతయ్య రోషన్ కెరీర్ మరియు పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను ఇందులో చూపించారు. నాలుగు ఎపిసోడ్‌లలో సుమారు 3 గంటల నిడివితో నలుగురు రోషన్స్ జీవితంలోని ముఖ్యమైన అంశాలను ఈ డాక్యుమెంటరీలో ప్రస్తావించారు. దీనికి శశి రంజన్ దర్శకత్వం వహించారు. 'రహెన్ నా రహెన్ హమ్' అనే పేరుతో వచ్చిన మొదటి ఎపిసోడ్ అలనాటి మ్యూజిక్ కంపోజర్ రోషన్ సంగీత ప్రయాణంపై దృష్టి పెడుతుంది. 'తోడా హై థోడే కి జరూరత్ హై' అనే రెండో ఎపిసోడ్ లో రాజేష్ రోషన్ గురించి వివరించారు. 'నిక్లే ది కహాన్ జానే కే లియే' ఎపిసోడ్ లో రాకేష్ రోషన్ విశేషాలను తెలియజేశారు. ఆయన కెరీర్ ప్రారంభం, యాక్టర్ గా ఫెయిల్యూర్స్, దర్శకుడిగా సక్సెస్ అవ్వడం, తన డైరెక్షన్ లో హృతిక్ కెరీర్‌కు బలమైన పునాది వేయడం, క్యాన్సర్‌తో పోరాడటం వంటి అంశాల గురించి చూపించారు. హృతిక్ రోషన్ గురించి 'కోయి మిల్ గయా' అనే నాలుగో ఎపిసోడ్ లో ప్రముఖంగా చూపించారు. అతని బాల్యం దగ్గర నుంచి హీరోగా ఎదిగే క్రమాన్ని వివరించారు. కానీ హృతిక్ సినీ ప్రయాణాన్ని అతని తండ్రి దర్శకత్వం వహించిన 'కహో నా ప్యార్ హై', 'కోయి మిల్ గయా', 'క్రిష్' వంటి మూడు చిత్రాలకే పరిమితం చేయడం నిరాశపరుస్తుంది. కెరీర్ ప్రారంభంలో హృతిక్ ఫెయిల్యూర్స్, హీరోగా నిలబెట్టిన ఇతర చిత్రాల గురించి ప్రస్తావించలేదు. ఫైనల్ గా 'ది రోషన్స్' అనేది బాలీవుడ్ లోని ఒక దిగ్గజ కుటుంబం యొక్క సినీ ప్రయాణాలను.. మ్యూజిక్, డైరెక్షన్, యాక్టింగ్ లలో రోషన్స్ సహకారాన్ని వివరించే ఒక డాక్యుమెంటరీ. దీని ద్వారా హిందీ సినిమా పరిశ్రమకు వారు చేసిన సేవలు, ఎవరికీ తెలియని కొన్ని విషయాలను తెలియజెప్పారు. అయితే కొన్నిపరిమితులకు లోబడే ఈ ఎపిసోడ్స్ సాగినట్లుగా అనిపిస్తుంది. వివాదాల గురించి చర్చించలేదు. ముఖ్యంగా హృతిక్ రోషన్‌పై సాగే ఎపిసోడ్ పెద్దగా ఆకట్టుకోలేదనే కామెంట్స్ వస్తున్నాయి. హిందీ ఆడియన్స్ కు, హృతిక్ అభిమానులను ఈ డాక్యుమెంటరీ మెప్పిస్తుంది.

# ఇంతకీ స్టార్ వారసుడి డెబ్యూ మూవీ ఉన్నట్టా.. లేనట్టా..?



నటసింహం బాలకృష్ణ వారసుడి తెరంగేట్రం గురించి ఎన్నో ఏళ్లుగా వార్తలు వింటూనే ఉన్నాం. మోక్షజ్ఞను హీరోగా చూడాలని నందమూరి అభిమానులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు మూడు పదుల వయసులో మోక్షు డెబ్యూకి సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో అంతా ఖుషీ అయ్యారు. కానీ ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా, ముహూర్తం ఫిక్స్ చేసుకున్న సమయానికి ఈ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు జరుపుకోలేకపోయింది. ముందుగా తన డైరెక్షన్ లోనే కుమారుడిని లాంచ్ చేయాలని భావించిన బాలయ్య.. చివరకు 'హను-మాన్' డైరెక్టర్ ప్రశాంత్ వర్మ చేతుల మీదుగా హీరోగా పరిచయం చేయాలని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. లాస్ట్ ఇయర్ మోక్షు బర్త్ డే స్పెషల్ గా సినిమాని అనౌన్స్ చేసి, ఓ స్టైలిష్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. చెరుకూరి సుధాకర్, తేజస్విని నందమూరి నిర్మాణంలో ఈ చిత్రం రూపొందనుందని తెలిపారు. డిసెంబరు ఫస్ట్ వీక్ లో ఓపెనింగ్ చేయాలని అనుకున్నారు కానీ, వివిధ కారణాలతో ఆగిపోయింది. మోక్షజ్ఞ ఫస్ట్ మూవీ కొత్త ముహూర్తం ఎప్పుడా అని ఫ్యాన్స్ ఆలోచిస్తున్న టైంలో, అసలు ఈ సినిమా ఉంటుందా లేదా? అనే రూమర్లు మొదలయ్యాయి. మెయిన్ రీజన్ ఏంటనేది తెలియదు కానీ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా ఆగిపోయిందని కొందరు అంటుంటే, మరికొందరు మాత్రం త్వరలోనే సెట్స్ మీదకు వస్తుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ హోస్ట్ చేస్తున్న 'అన్ స్టాపబుల్' టాక్ షోలో తాజాగా మోక్షు డెబ్యూ టాపిక్ వచ్చింది. ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న బాలయ్య షోకి రామ్ చరణ్ గెస్ట్ గా వచ్చిన సంగతి తెలిసిందే. అందులో పవన్ కల్యాణ్ పెద్ద కొడుకు అకిరా నందన్ తెరంగేట్రం గురించి అడిగారు బాలకృష్ణ. తాను కూడా తమ్ముడి డెబ్యూ కోసం వెయిట్ చేస్తున్నానని చెప్పిన చెర్రీ.. OG మూవీలో ఉన్నాడో లేదో తనకూ తెలియదని బదులిచ్చారు. ఆ వెంటనే పనిలో పనిగా మోక్షజ్ఞ లాంచింగ్ డేట్ చెప్పమని బాలయ్యను ప్రశ్నించారు చరణ్. దీనికి ఆయన నవ్వుతూ తల ఊపుతూ 'అతి త్వరలో' అని సమాధానమిచ్చారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ డెబ్యూ మూవీ ఉంటుందని బాలయ్య చెప్పకపోవడంతో, ఈ ప్రాజెక్ట్ ను పక్కన పెట్టేశారా? వేరే డైరెక్టర్ తో వెళ్తారా? అనే సందేహాలను నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం టాక్ షోలో ప్రశాంత్ మూవీ నుంచి రిలీజ్ చేసిన మోక్షు పోస్టర్ ను ప్రదర్శించారు కాబట్టి.. త్వరలోనే ఈ సినిమా స్టార్ట్ అవుతుందని నమ్మకంగా ఉన్నారు. ఏదేమైనా ఏదొక అప్డేట్ ఇచ్చి పుకార్లకు ఫుల్ స్టాప్ పెట్టాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇకపోతే ప్రశాంత్ వర్మ సినిమా ప్రారంభం కాకపోవడానికి మోక్షజ్ఞ ఆరోగ్యం బాగాలేకపోవడమే కారణమని బాలయ్య ఆ మధ్య చెప్పారు. మేకర్స్ సైతం రూమర్స్ ను నమ్మొద్దు అంటూ ప్రకటన ఇచ్చారు. అయినా సరే ఆల్రెడీ అనౌన్స్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఉండకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. మరోపక్క 'హనుమాన్' వంటి బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టి ఏడాది గడుస్తున్నా, దర్శకుడు ఇంకా తన తదుపరి సినిమాని సెట్స్ మీదకు తీసుకురాలేకపోతున్నారు. 'జై హనుమాన్' చిత్రాన్ని లైన్ లో పెట్టారు కానీ, దానికింకా టైమ్ ఉంది. మరి త్వరలోనే ప్రశాంత్ నెక్ట్స్ మూవీ పట్టాలెక్కుతుందేమో చూడాలి.

# న్యూజిలాండ్ గుట్టు విప్పేసిన కన్నప్ప!

కన్నప్ప షూటింగ్ ఎక్కువ భాగం న్యూజిలాండ్ లో నిర్వహించిన సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా మోహన్ బాబు చిత్రాన్ని నిర్మించారు. ఆయన ఈ ప్రాజెక్ట్ ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పట్టాలెక్కించారు. దేశంలో ఎన్నో అందమైన లోకేషన్లు..ప్రపంచంలో ఎన్నో దేశాలు ఉన్నా ప్రత్యేకంగా దాదాపు 70 నుంచి 80 శాతం షూటింగ్ న్యూజిలాండ్ లోనే చేసారు. అయితే ఇలా న్యూజిలాండ్ ని టార్గెట్ చేయడంతో కన్నప్పకి...న్యూజిలాండ్ కి ఉన్న సంబంధం ఏంటనే ఒకటే చర్చ ప్రాజెక్ట్ మొదలైన నాటి నుంచి జరుగుతూనే ఉంది. కథకి...న్యూజిలాండ్ కి బలమైన సంబంధం ఏదైనా ఉందా? ఆ కోణంలో న్యూజిలాండ్ కి పెద్ద పీట వేసారా? అటు ఇండస్ట్రీలోనూ చర్చకొస్తుంది. షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు



జరుగున్నాయి రిలీజ్ కూడా సమ్మర్ లో జరుగుతుంది. కానీ ఇంత వరకూ న్యూజిలాండ్ గుట్టు మాత్రం విప్పలేదు. ఈ నేపథ్యంలో చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్ లో దర్శకు డు ముకేష్ కుమార్ సింగ్ ఆ సీక్రెట్ చెప్పేసారు. కన్నప్ప మూడవ దశాబ్ధం నాటి కథ.

అప్పటి వాతావరణం , నాటి ప్రకృతి రమణీయతను మా సినిమాలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతోనే షూటింగ్ ఎక్కువ భాగం న్యూజి లాండ్ లో చేసాం. కథకి...న్యూజిలాండ్ కి ఉన్నా సంబంధం ఏంటన్నది తెలియాలంటే? తెరపై సినిమా చూడాల్సిందే అన్నారు. పాన్ ఇండియాలో ఈ చిత్రం ఏప్రిల్ 25న రిలీజ్ అవుతుంది. ఇప్పటికే ఈ సినిమా రిలీజ్ అవ్వాలి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ సహా వివిధ కారణాలుగా రిలీజ్ వాయిదా పడుతుంది. అయినా ఎట్టిపరిస్థితుల్లో ఈసారి మాత్రం ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని విష్ణు, మోహన్ బాబులు కంకణం కట్టుకున్నారు. మరోవైపు మంచు ఫ్యామిలీ కుటుంబ వివాదం కొన్ని రోజులుగ ఎంత సంచలనమైందో తెలిసిందే.

# ఆరడుగుల బుల్లెట్టు ఈ నటవారసురాలు!

ఖుషి కపూర్ నటించిన మొదటి చిత్రం లవ్‌యపా విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. జునైద్ ఖాన్ - ఖుషీ ఈ చిత్రంలో జంటగా నటించగా, ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. ట్రైలర్ లో ఖుషి నటన హైలైట్ అయింది. సినిమాలోని ఒక పాట కోసం ఖుషి ప్రత్యేకంగా క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ పొందింది. ఒక కళాకారిణిగా అంకితభావం, బహుముఖ ప్రజ్ఞ అందరికీ నచ్చుతోంది. ప్రస్తుతం ఈ అందమైన ప్రేమకథా చిత్రాన్ని తెరపై చూడాలని అంతా ఆసక్తిగా వేచి చూస్తున్నారు. నేటితరం ప్రేమ కథతో రూపొందించిన లవ్‌యాపాలో నటీనటుల మరపురాని ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన విజువల్స్ కట్టి పడేస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రంలో లవ్ ఎలిమెంట్ రకరకాల కోణాలను అందంగా అన్వేషిస్తుంది.



తరతరాలుగా ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందిందని ప్రచార వేదికపై జునైద్ చెప్పారు. లవ్ యాపా ప్రచార వేదికల వద్ద ఫోటోషూట్లతో ఖుషి కపూర్ చాలా హంగామా సృష్టిస్తోంది. తాజాగా ఖుషి మిర్రర్ సెల్ఫీ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. అసలే ఆరడుగుల బుల్లెట్టులా ఒడ్డు పొడుగు ఉండే ఖుషి, ఇలా సెల్ఫీ దిగుతూ కుర్రకారు గుండెల్ని టచ్ చేస్తోంది. పింక్ ఫోను.. వైట్ షర్ట్.. డెనిమ్ బ్లూ ఫ్యాంట్.. కాంబినేషన్ అదిరిపోయిందంటూ అభిమానులు ఈ ఫోటోగ్రాఫ్ ని వైరల్ గా షేర్ చేస్తున్నారు. లవ్ యాపా సక్సెసైతే ఖుషి కపూర్ కెరీర్ కి అది పెద్ద బూస్ట్ కానుంది.




కోల్‌కతా: దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి శిక్ష ఖరారైంది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు అతడికి జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది. ఈ శిక్ష ఖరారు చేయడానికి ముందు న్యాయమూర్తి ఇరు పక్షాల వాదనలు విన్నారు. తనను ఈ కేసులో తప్పుగా ఇరికించారని సంజయ్ రాయ్ తన వాదన వినిపించగా.. ఇది అరుదైన కేసని, అతడికి మరణ శిక్ష విధించాలని సీబీఐ తరఫు న్యాయవాది వాదించారు. శనివారం న్యాయస్థానం సంజయ్‌ను దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన (తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారించింది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరినుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇక సంజయ్‌కు శిక్ష ఖరారు నేపథ్యంలో కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు.

## 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024'.. ప్రకటించిన రాజ్‌భవన్




హైదరాబాద్: 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు.

**అవార్డుకు ఎంపికైన వారు..** దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురం గారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్

## నీళ్ల మంత్రి సొంత జిల్లాలోనే సాగు నీటికి కటకట.. హరీష్ ఫైర్



హైదరాబాద్, జనవరి 20: సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనం అని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే సాగు నీటికి కటకట ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రుల మాటలు కోటలు దాటితే.. ఆచరణ గడప దాటదంటూ ఎద్దేవా చేశారు. ఎక్స్ వేదికగా హరీష్ రావు స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది, రైతన్నకు క'న్నీటి' గోసను తెచ్చిందంటూ మండిపడ్డారు. పంట పొలాలకు నీళ్ల కోసం రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితిని కల్పించిందన్నారు. సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సొంత జిల్లా సూర్యపేటలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. యాసంగి సాగునీటి విడుదల షెడ్యూల్ పేరిట కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇచ్చారని మండిపడ్డారు. ఎస్ఆర్ఎస్‌పీ స్టేజ్ - 2 లో భాగంగా తుంగతుర్తి, సూర్యపేట, కోదాడ తదితర నియోజకవర్గాల్లోని 3,36,630 ఎకరాలకు సాగు నీటిని విడుదల చేస్తామని ప్రకటనల్లో పేర్కొన్నారన్నారు. ప్రచారం చేసుకున్నారు గానీ రైతన్నల పంట పొలాలకు నీళ్లు మాత్రం విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. " మీ ప్రభుత్వ మాటలు నమ్మి నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏం కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ ప్రశ్నించారు. నాట్ల దశలోనే సాగు నీటికి గోస పడితే, మున్ముందు సాగు నీరు నీటి సరఫరా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహా మంత్రుల మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటవు అని మరోసారి రుజువైందన్నారు. అద్భుతాలు చేస్తున్నట్లు భ్రమలు కల్పించడం మానేసి, ఇప్పటికైనా ఆచరణకు దిగాలని హితవుపలికారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు, ప్రతిపక్షాల మీద ఆరోపణలు చేయడం మానేసి పంట పొలాలకు నీళ్లు అందించాలని.. ఆందోళనలో ఉన్న రైతన్నకు దన్నుగా నిలవాలని హరీష్ రావు ట్వీట్ చేశారు.

## కవితకు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చిన రఘునందన్ రావు



సంగారెడ్డి: పసుపు బోర్డు తమ పోరాటం వల్లే వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత వ్యాఖ్యలపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు ఆమె ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయని.. చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్‌కు చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుందని ఎంపీ రఘునందన్ రావు సలహా ఇచ్చారు. మొదటగా ఆమె ఆస్పత్రిలో చూయించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడితే బాగుంటుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో ఇవాళ(సోమవారం) మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ...పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి కేటీఆర్‌కు రైతులు గుర్తుకు రాలేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీకి అధికారం పోయాక రైతులపై కేటీఆర్‌కు ప్రేమ పెరిగిందా అని ప్రశ్నించారు. అధికారం పోయాక కేటీఆర్ రైతు ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్‌ను గౌరవించలేదని అన్నారు. కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదని ఎంపీ రఘునందన్ రావు ఆక్షేపించారు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆరోపించారు. గాంధీ, నెహ్రూ కుటుంబాల్లోని ఐదు తరాలు రాజ్యాంగాన్ని అవమానించారు, తుంగలో తొక్కారని ఆక్షేపించారు. ఆనాడు ప్రధాని మన్మోహన్ సింగ్‌ని కాదని యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియా గాంధీ నిర్ణయాలు తీసుకుని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని చెప్పారు. ఇప్పుడు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రోడ్లపై తిరుగుతున్నారని అన్నారు. అధికారంలో లేనప్పుడు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి పేదలు గుర్తుకు వస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

## కేసు పోలీసుల చేతుల్లో ఉంటే.. మరణశిక్ష పడేది: సీఎం మమతా

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి న్యాయస్థానం జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ తీర్పుపై తాను సంతృప్తి చెందలేదని అన్నారు. "జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించిన కేసులో దోషికి మరణశిక్ష విధించాలని మేమంతా డిమాండ్ చేశాం. కానీ, అలా జరగలేదు. ఈ కేసును బెంగాల్ పోలీసుల నుంచి బలవంతంగా సీబీఐకి బదిలీ చేశారు. ఒకవేళ ఈ కేసు దర్యాప్తు బెంగాల్ పోలీసుల చేతుల్లోనే ఉంటే దోషికి మరణశిక్ష పడేలా శాయశక్తులా ప్రయత్నించేవారు. అసలు విచారణ ఎలా జరిగిందో తెలియదు. రాష్ట్ర పోలీసులు విచారించిన ఇలాంటి అనేక కేసుల్లో దోషులకు మరణశిక్ష పడింది. ప్రస్తుత తీర్పు సంతృప్తికరంగా లేదు" అని విలేకరుల ఎదుట సీఎం మమతా పేర్కొన్నారు. కాగా.. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసు బెంగాల్ పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ అయింది. దీనిలో భాగంగా విచారణ అనంతరం ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు సంజయ్ తన వాదనలు వినిపించాడు. తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని అన్నాడు. తాజాగా కోర్టు అతడికి జీవిత ఖైదును విధించింది.



## కేసీఆర్‌పై కాళేశ్వరం కమిషన్ ఫోకస్

హైదరాబాద్, జనవరి 20: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఒక వైపు విచారణ.. మరోవైపు రిపోర్ట్ తయారీపై కాళేశ్వరం కమిషన్ ప్రధానంగా దృష్టిపెట్టింది. ఇప్పటి వరకు జరిగిన విచారణపై ప్రాథమిక నివేదికను కమిషన్ సిద్ధం చేసింది. దాదాపు 208 పేజీలతో కమిషన్ చైర్మన్ పీసీ చంద్ర ఘోష్ నివేదికను సిద్ధం చేశారు. విచారణ పూర్తయిన తర్వాత ఫైనల్ రిపోర్ట్ ఇచ్చేందుకు కమిషన్ ప్రిపేర్ అవుతున్నారు. వచ్చే నెల వరకు అధికారులు, కాంట్రాక్టు సంస్థల విచారణ పూర్తి చేయాలని నిర్ణయించింది. అనంతరం మార్చిలో మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌ను కమిషన్ విచారణకు పిలవనుంది. ఇక ఫైనల్‌గా మార్చిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణకు పిలిచే యోచనలో కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా కాళేశ్వరం ఇంజనీర్లు, అధికారులు కేసీఆర్ పేరు చెప్పారు. కేసీఆర్ ఆదేశాల మేరకే నిర్ణయాలు తీసుకున్నామని ఒప్పుకున్నారు. దీంతో కేసీఆర్‌ను కూడా ప్రశ్నించాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది. మార్చి నెలాఖరి కల్లా ప్రభుత్వానికి నివేదిక అందించేలా కమిషన్ చైర్మన్ కసరత్తు చేస్తోంది. ఇప్పటి వరకు ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, డిజైనర్లను విచారించి స్టేట్‌మెంట్లను రికార్డు చేసిన కమిషన్.. ఇక ఆనాటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై దృష్టిసారించింది. అందులో ప్రధానంగా కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్, ఆనాడు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్‌రావుకు కూడా నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన విచారణలో హాజరైన ఇంజనీర్లు, అధికారుల్లో ఎక్కువగా.. కేసీఆర్ నిర్ణయాల మేరకు ముందుకు వెళ్లినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను విచారించాలనే నిర్ణయానికి కమిషన్ వచ్చింది. కాగా.. సంక్రాంతి పండుగ సందర్భంగా విచారణకు కాస్త బ్రేక్ ఇచ్చిన కాళేశ్వరం కమిషన్ చైర్మన్ పీసీ చంద్ర ఘోష్ తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఇక మరింత వేగంగా కమిషన్ విచారణ సాగనుంది. రేపటి (మంగళవారం) నుంచి తిరిగి కమిషన్ విచారణ ప్రారంభంకానుంది. పలువురు ఫైనాన్స్ ఉద్యోగులకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు పంపింది. ఈ క్రమంలో రేపటి నుంచి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్ విభాగం ఉద్యోగులు, కాంట్రాక్ట్ సంస్థలను కమిషన్ వరుసగా విచారించనుంది. ఈ దఫా విచారణలో వి.ప్రకాష్‌ను బహిరంగ విచారణకు కాళేశ్వరం కమిషన్ పిలువనుంది. మాజీ ఈఎన్‌సీని మరొక్కసారి బహిరంగ విచారణకు పిలిచే అవకాశం ఉంది. ఈ సెషన్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను కమిషన్ ముగించనుంది. ఇప్పటివరకు ఫైనాన్స్ అండ్ పాలసీ, టెక్నికల్ అంశాలపై విచారణను పూర్తి చేసింది కమిషన్. నిబంధనలు పాటించకుండా నిధులు విడుదల చేసినట్లు గుర్తించింది. నిబంధనలు పాటించని అధికారులపై సెక్షన్ 70 ప్రకారం చర్యలు తీసుకావాలని సూచించింది. పనులు పూర్తి కాకుండానే బిల్లులు విడుదల చేసినట్లు కాళేశ్వరం కమిషన్ గుర్తించింది.

## తెలంగాణలో జరిగేది అదే.. రాసిపెట్టుకోండి.. కామారెడ్డి ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు



పశ్చిమగోదావరి, జనవరి 20: తెలంగాణలో రాజకీయాలపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే 45 రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని స్పష్టం చేశారు. ఇది పక్కా.. రాసిపెట్టుకోండి అంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. సోమవారం నాడు భీమవరంలో రెబల్ స్టార్ కృష్ణంరాజు జయంతి సేవా కార్యక్రమాల్లో తెలంగాణా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్ తప్పొప్పులను కోర్టు నిరూపిస్తుందన్నారు. ఆయన క్వాష్ పిటీషన్ వేస్తే అది కొట్టేశారని.. తప్పు చేసినవాడు ఎంతటి వాడైనా శిక్షకు అర్హులే అని తేల్చిచెప్పారు. ఇందులో రాజకీయ కక్షలు లేవన్నారు. కేటీఆర్ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు ఎటువంటి వాతావరణాన్ని సృష్టించారనేది గ్రామాల్లోని ప్రజలు అందరికీ తెలుసంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే తెలంగాణ అధికారులు, నేతల విదేశీ పర్యటనలపై ఎమ్మెల్యే పలు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కార్పొరేషన్ చైర్మన్‌లు మొదలుకొని స్పీకర్ వరకూ అందరూ విదేశీ పర్యటనలు చేస్తున్నారన్నారు. ఆ పర్యటన వల్ల వచ్చే లాభం ఎంతంటే.. పేపర్ మీద చూపించే తెలివి ఒక్కరికీ లేదని విమర్శించారు. "పర్యటన చేసొచ్చాక.. ఇన్ని కోట్ల ఖర్చు అయినాయి, దీనికి వెయ్యింతలు అవకాశాలు, ఇండస్ట్రీస్ వచ్చాయి, లాభాలు వచ్చాయని ఎదైనా ఇక్కడ చూపించారా" అని ప్రశ్నించారు. ఎవరైనా చూపిస్తారా.. ఆ దమ్ము ధైర్యం ఉన్న వాడే విదేశీ ప్రయాణాలు చేయాలన్నారు. లేదా ఇంట్లో కూర్చుని ఇక్కడున్న యువతను ఎంకరేజ్ చేయాలని హితవుపలికారు. ఆంధ్రాలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందనే ఆశతో ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించిందని... ఇంకా సహకరిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో వేల కోట్ల రూపాయలు ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిందని తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ప్రధాని నరేంద్ర మోదీని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వెల్లడించారు.

**సేవా కార్యక్రమాలు...** కాగా.. పశ్చిమగోదావరి జిల్లాలో రెబల్ స్టార్ కృష్ణంరాజు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. భీమవరంలో ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్, ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ సంయుక్తంగా ఈ మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. షుగర్ వ్యాధి వారికి పాదాలు పగుళ్ళు, పుండ్లు, గాయాలు, స్పర్శ కోల్పోవడంపై డాక్టర్లు ప్రత్యేకంగా చికిత్స అందజేస్తున్నారు. లండన్ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్ వేణు కవర్తపు పర్యవేక్షణలో మెడికల్ క్యాంపు జరుగుతోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు వేలాదిగా వచ్చి వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు.




## మందుబాబులకు కిక్ ఇచ్చే న్యూస్.. కింగ్‌ఫిషర్ ఈజ్ బ్యాక్

తెలంగాణలోని లిక్కర్ లవర్స్‌కు అదిరిపోయే గుడ్ న్యూస్. రాష్ట్రంలో మళ్లీ కింగ్‌ఫిషర్ బీర్లు అందుబాటులోకి రాబోతున్నాయి. తెలంగాణలో కింగ్‌ఫిషర్‌తో పాటు హెన్‌కిన్ బీర్ల సరఫరాను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు వాటిని తయారు చేసే యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ టీజీబీసీఎల్)తో చర్చలు జరిపాక ఈ డెసిషన్ తీసుకున్నామని పేర్కొంది.

**దూసుకెళ్లిన షేర్ ధర! :** బీర్ల ధరల పెంపు, సకాలంలో బకాయిల చెల్లింపులు తదిరత అంశాలపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చల అనంతరం వాటి సరఫరా మీద సోమవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది యునైటెడ్ బ్రేవరీస్. తమ డిమాండ్ల మీద త్వరలోనే డెసిషన్ తీసుకుంటామని గవర్నమెంట్ తెలపడంతో కస్టమర్లు, కార్మికులను దృష్టిలో ఉంచుకొని వెనక్కి తగ్గామని స్పష్టం చేసింది. సర్కారు హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నామని యునైటెడ్ బ్రేవరీస్ చెప్పుకొచ్చింది. కాగా, బీర్ల తయారీపై ప్రకటనతో ఆ సంస్థ షేర్ ధర ఒక్కసారిగా దూసుకెళ్లింది. అప్పర్ సర్క్యూట్‌ను తాకడం విశేషం.

## రేవంత్ పాలన అవినీతి మయంగా మారింది: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిజామాబాద్: రేవంత్ ప్రభుత్వ పాలన పూర్తి అవినీతి మయంగా మారిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ సంవిధాన గౌరవ్ దివస్‌పై ఇవాళ వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు దేశానికే గర్వకారణమని చెప్పారు. పసుపు బోర్డు సాధించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 కుంభకోణాలు జరిగాయని.. వాటిని ఆధారాలతో సహా బయట పెట్టినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎఫ్.అర్.బి.ఎం పరిధిని దాటి విపరీతంగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అప్పులు చేసినప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఎందుకు పూర్తిగా అమలు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థం కోసం పనిచేస్తే , బీజేపీ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com